


## విలేఖరులు కావలెను

సీనియర్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో తెలంగాణ, ఏపీ లో వెలువడుతున్న ప్రముఖ తెలుగు దిన పత్రిక హంస వాయిస్ దిన పత్రిక, S2 న్యూస్ ఛానల్ లో పని చేయడానికి ఏపీ, తెలంగాణ లో పని చేయడానికి జిల్లాల వారిగా బ్యూరో ఇన్చార్జి లు, స్టాఫ్ రిపోర్టర్లు కావలెను. అనుభవం ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. ఆసక్తి కలవారు ఈ క్రింది అడ్రస్ లో సంప్రదించవచ్చు.

హంస వాయిస్

Office Adress:
Hamsa Voice Telugu Daily
Plot No: 601, Moghul's Court,
Alimineti Madhava Reddy Flyover,
Fateh Maidan, Abids,
Hyderabad, Telangana
Pin : 500001
Cell No: 9949246060, 6303577627

# హంస

మా అక్షరం... సామాన్యుడి గళం వాయిస్

## ఇంటర్ విద్యార్థులకు గుడ్‌న్యూస్

- ఏప్రిల్ 1 నుంచే సెకండియర్ తరగతులు
- తరగతుల నిర్వహణపై ఆర్టీసీకి సమాచారం ఇవ్వని బోర్డు
- విద్యార్థుల బస్‌పాస్‌లను రెన్యువల్ చేయని ఆర్టీసీ సిబ్బంది
- ఏప్రిల్ పాస్‌లు రెన్యువల్‌కు ఆదేశాలు 2లో..

ఆదివారం | 06-04-2025 | కర్నూలు | epaper.hamsavoice.in | సంపుటి: 2 | సంచిక: 262 | పేజీలు 8+8 | వెల : 6.50

KURNOOL I ANANTHAPURAM I HYDERABAD I VIJAYAWADA I AMARAVATHI I TIRUPATI I TADEPALLIGUDEM I VISHAKAPATNAM I KADAPA I HYDERABAD I KARIMNAGAR I NIZAMABAD I NALGONDA I MAHABUBNAGAR I WARANGAL I KHAMMAM



## టీడీపీ వర్సెస్ జనసేన

- పిఠాపురంలో ఆధిపత్య పోరు
- సోషల్ మీడియాలో డైలాగ్ వార్!
- ఎమ్మెల్సీ నాగబాబు పర్యటన కారణం
- రెండు పార్టీ నేతల పోటాపోటీగా నినాదాలు
- ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట
- ఉద్రిక్త పరిస్థితులు

2లో..

పిఠాపురం, ఏప్రిల్ 05, (హంస వాయిస్)

పిఠాపురంలో ఆధిపత్య పోరు పీక్‌స్‌కు చేరింది. టీడీపీ వర్సెస్ జనసేన ఫైట్ మరింత ముదిరింది. పిఠాపురం మండలం కుమారపురం గ్రామంలో ఎమ్మెల్సీ నాగబాబు సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసైనికుల పోటా పోటీగా నినాదాలు చేసుకున్నారు. ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో.. పోలీసులు ఇరు పార్టీల వారిని చెదరగొట్టారు.

## దేశంలో పుట్టిన ఏ వ్యక్తీ పేదోడుగా ఉండొద్దు

### అట్టడుగున ఉన్నవారికి చేయూత ఇవ్వాలి

- రాష్ట్రాభివృద్ధికి కొత్త ఆలోచనలు
- జగ్జీవన్‌రామ్ స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం
- మహిళల కోసం డ్వాక్రా సంఘాలను తీసుకొచ్చాం
- జన్మభూమి పిలుపుకు అందరూ స్పందించారు
- సమాజానికి ఎంతో కొంత ఇవ్వాలి
- సమాజాన్ని ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తాను
- రాబోయే 20-30 సంవత్సరాలకు ముందే ఆలోచిస్తా
- పేదరిక నిర్మూలన జరగాలి.. తలసరి ఆదాయం పెరగాలి
- ఎన్టీఆర్ జిల్లా ముప్పాళ్లలో చంద్రబాబు 2లో..

ఎన్టీఆర్ జిల్లా, నందిగామ నియోజకవర్గం, ముప్పాళ్లలోని బాలికల గురుకుల సంక్షేమ వసతి గృహాన్ని, పాఠశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడారు. వంటశాల, భోజనశాలలో పరిశుభ్రతను, సరుకులను పరిశీలించారు.



ఎన్టీఆర్ జిల్లా, ఏప్రిల్ 05, (హంస వాయిస్)

జగ్జీవన్‌రామ్ స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రాభివృద్ధికి ఎప్పటికప్పుడు కొత్త ఆలోచనలు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా ముప్పాళ్లలో చంద్రబాబు పర్యటించారు. అక్కడ నిర్వహించిన బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో పాల్గొని నివాళి అర్పించారు. పీ-4 కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాలతో సీఎం మాట్లాడారు.



## ఆలయం నిర్మాణానికి హెల్ప్ చేయండి

- సహకరించండని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుకు బండి సంజయ్ లేఖ
- 2023లోనే కరీంనగర్ లో టీటీడీ ఆలయ నిర్మాణానికి అనుమతి
- అదే ఏడాది మే 31న 10 ఎకరాల స్థలంలో భూమి పూజ
- నాటి నుంచి నేటి వరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు 2లో..



హైదరాబాద్, ఏప్రిల్ 05, (హంస వాయిస్)

టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ లేఖ రాశారు. దేశవ్యాప్తంగా ధర్మ ప్రచారంతో పాటు హిందూ దేవాలయాల నిర్మాణ అభివృద్ధికి టీటీడీ చేస్తున్న కృషిని అభినందిస్తూ ఈ లేఖ రాశారు. ధూప-దీప-నైవేద్యాలకు నోచుకోని అనేక దేవాలయాలను టీటీడీ ఆదుకోవడం గొప్ప విషయమని ప్రశంసించారు.

## పవన్ భద్రాచలం వెళ్లట్లేదు

- అధికారుల ప్రకటన
- శ్రీరామ నవమి సందర్భంగా వెళ్లే ఆలోచన
- కల్యాణ వేడుక కోసం వెళ్లాలని ఆలోచన
- భక్తుల రద్దీ, ఇతర కారణాలతో పర్యటన రద్దు



అమరావతి, ఏప్రిల్ 05, (హంస వాయిస్)

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భద్రాచలం పర్యటన రద్దు చేసుకున్నారు. శ్రీరామనవమి సందర్భంగా రేపు భద్రాచలంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. సీతారాముల కల్యాణం సందర్భంగా నేడు, రేపు పవన్ కల్యాణ్ భద్రాచలంలో పర్యటించాలని భావించారు. ఇందులో భాగంగా శనివారం హైదరాబాద్ లోని తన నివాసం నుంచి బయలుదేరి సాయంత్రం 5 గంటలకు భద్రాచలం చేరుకోవాల్సి ఉంది.

2లో..

## అటు ఎండ.. ఇటు వాన

- భిన్న వాతావరణం
- 3 రోజులు వర్షా లు.. పలుచోట్ల ఎండలు
- ఐఎండీ అధికారులు అలర్ట్
- పిడుగులు పడే అవకాశం ఉన్నట్లు వార్నింగ్
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెల్లడి
- మోస్తారు నుంచి భారీ వర్ష సూచన 2లో..

## రెండు వారాల టైమ్ ఇస్తాం

- రామానాయుడు స్టుడియోకు కలెక్టర్ నోటీసులు
- విశాఖపట్నంలోని రామానాయుడు స్టుడియో
- వివరణ తర్వాత చర్యలు ఉంటాయి
- స్టూడియో నిర్మాణం కోసం ప్రభుత్వం 34 ఎకరాలు
- 15.17 ఎకరాలు హౌసింగ్ లేఅవుట్ కోసం
- మార్పు చేయాలన్న స్టూడియో యాజమాన్యం 2లో..




## వీరరాఘవరెడ్డికి బెయిల్

- చిలుకూరు అర్చకులు రంగరాజన్ దాడి చేసిన వ్యక్తి
- రాజేంద్రనగర్ కోర్టు షరతులతో కూడిన బెయిల్
- రూ.15 వేలతో రెండు పూచీకత్తులు
- ఫిబ్రవరి 7న రంగరాజన్ ఇంటికి వెళ్లిన వీరరాఘవ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 05, (హంస వాయిస్)

చిలుకూరు బాలాజీ టెంపుల్ అర్చకులు సీఎస్ రంగరాజన్‌పై దాడి చేసిన కేసులో ప్రధాన నిందితుడు వీరరాఘవ రెడ్డికి రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ.15 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. ఫిబ్రవరి 7న రంగరాజన్ ఇంటికి వెళ్లిన వీరరాఘవ రెడ్డి రామరాజ్య స్థాపన కోసం సైన్యాన్ని తయారు చేస్తున్నానని మద్దతు కోరాడు. ఆ సమయంలోనే రంగరాజన్‌పై దాడి జరిగింది. ఈ కేసులో వీరరాఘవ రెడ్డిని మొయినాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. 2లో..





## కొండుపల్లిలోని గనిలో పేలుడు

- అనంతపురం జిల్లాలో ఘటన
- నలుగురికి తీవ్రగాయాలు
- భూగర్భ డోలమైట్ గనిలో ఘటన
- యాడికిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలింపు
- పేల్చేందుకు నిప్ప పెడ్తున్న టైమ్‌లో ఘటన 2లో..



అనంతపురం, ఏప్రిల్ 05, (హంస వాయిస్)

అనంతపురం జిల్లాలో ప్రమాదం చోటుచేసుకుంది. పెద్దవడుగూరు మండలం కొండుపల్లిలో పేలుడు సంభవించింది. భూగర్భ డోలమైట్ గనిలో ఈ పేలుడు ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే యాడికిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. భూగర్భ గనిలో పేల్చడానికి నిప్ప పెడుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. డోలమైట్ గనిలో ఉదయం నుంచి కార్మికులు పనిలో నిమగ్నమై ఉన్నారు.

## ట్రోలింగ్ పట్టించుకోను

- ఆస్తులు తాకట్టు పెట్టి
- సినిమా తీశా
- సినీ నటుడు మోహన్ బాబు
- సినిమాల్లోనే ఉంటా
- మోహన్ బాబు కామెంట్స్ వైరల్
- హీరోగానే చేయాలని నేను ఏ రోజు అనుకోలేదు 2లో..
- విలన్ గా ఎదగాలని ఆశపడ్డాను
- నా గురువు దాసరి నారాయణరావు

# కరీంనగర్‌లో శ్రీవారి ఆలయం నిర్మాణం

**హైదరాబాద్, ఏప్రిల్ 05, (హంస వాయిస్)**

టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ లేఖ రాశారు. దేశవ్యాప్తంగా ధర్మ ప్రచారంతో పాటు హిందూ దేవాలయాల నిర్మాణ అభివృద్ధికి టీటీడీ చేస్తున్న కృషిని అభినందిస్తూ ఈ లేఖ రాశారు. ధూపదీపనైవేద్యాలకు నోచుకోని అనేక దేవాలయాలను టీటీడీ ఆదుకోవడం గొప్ప విషయమని ప్రశంసించారు. కరీంనగర్‌లో చేపట్టిన టీటీడీ ఆలయ నిర్మాణానికి తగిన సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే 2023లో కరీంనగర్‌లో టీటీడీ ఆలయ నిర్మాణానికి అనుమతి లభించిందని, అదే ఏడాది మే 31న కరీంనగర్‌లోని 10 ఎకరాల భూమిలో భూమి పూజ కూడా జరిగిందని గుర్తు చేశారు. అయితే ఆ రోజు నుంచి నేటివరకు నిర్మాణం దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టీటీడీ ఆలయ నిర్మాణాన్ని ఆసక్తిగా ఎదురుచూస్తున్న కరీంనగర్ సహా పొరుగు జిల్లాల హిందూ భక్తుల ఆకాంక్షలను దృష్టిలో పెట్టుకుని, ఆలయ నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన కొనసాగించేలా తగిన చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ కోరారు.

# అటు ఎండ.. ఇటు వాన

**వైజాగ్, ఏప్రిల్ 05, (హంస వాయిస్)**

ఏపీలో భిన్న వాతావరణం నెలకొంది. ఈ మూడు రోజులు కొన్నిచోట్ల ఎండలు, మరికొన్ని చోట్ల పిడుగులతో కూడిన వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. రాష్ట్రంలో వాతావరణ అనిశ్చితి నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

**మోస్తారు నుంచి భారీ వర్ష సూచన...**

ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఇవాళ,రేపు కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. రేపు కాకినాడలో మోస్తారు వర్షాలు పడుతాయని వివరించింది. సోమవారం అల్లూరి,కాకినాడ,తూర్పుగోదావరి,ఏలూరు జిల్లాల్లో అక్కడక్కడ మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది.

రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ప్రజలు చెట్లు క్రింద, బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని సూచించింది. గురువారం 12 ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసాయని అలాగే 23 ప్రాంతాల్లో 50మిమీ పైగా వర్షపాతం నమోదైందని వెల్లడించింది. మన్యం జిల్లాలోని జియ్యమ్మవలసలో 39.9□C అధిక ఉష్ణోగ్రత నమోదైందని వివరించింది.

**తెలంగాణలో తేలికపాటి వర్షా లు:**

ఇక తెలంగాణలో చూస్తే ఇవాళ పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. ఎలాంటి హెచ్చరికలు లేవని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. రేపు కూడా ఇదే మాదిరి వాతావరణం ఉండొచ్చని అంచనా వేసింది. ఇక ఏప్రిల్ 7వ తేదీ నుంచి మళ్లీ రాష్ట్రంలో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్నిచోట్ల ఒక మోస్తారు వర్షాలు పడొచ్చని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఎలాంటి హెచ్చరికలు లేవని వివరించింది. ఏప్రిల్ 10వ తేదీ వరకు తేలికపాటి జల్లులు కురుస్తాయని ప్రకటించింది.

# ట్రోలింగ్ పట్టించుకోను

**హైదరాబాద్, ఏప్రిల్ 05, (హంస వాయిస్)**

కలెక్షన్ కింగ్ మోహన్ బాబు ప్రస్తుతం కన్నప్ప సినిమా పనుల్లో బిజీగా ఉన్నారు. ఇప్పటికే సినిమా షూటింగ్ కంప్లీట్ చేసుకున్న ఈ సినిమా.. ఏప్రిల్ 25న రిలీజ్ చేయాలనుకున్నారు. కానీ వీఎఫ్ ఎక్స్ పనుల కారణంగా వాయిదా వేశారు. ఈ క్రమంలోనే మోహన్ బాబు తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని అనేక విషయాలను పంచుకున్నారు. 'నేను సినిమాల్లోకి వచ్చింది నటుడిగా నిరూపించుకునేందుకు. హీరోగానే చేయాలని నేను ఏ రోజు అనుకోలేదు. విలన్ గా ఎదగాలని ఆశపడ్డాను. నా గురువు దాసరి నారాయణరావు వల్లే హీరో అయ్యాను. అప్పట్లో సినిమాల్లో విలక్షణ నటుడిగా నేను పేరు తెచ్చుకున్నాను. అన్ని పాత్రలు చేశాను' అన్నారు.

'సీనియర్ ఎన్టీఆర్ తో లక్ష్మి పిక్చర్స్ బ్యానర్ మీద మేజర్ చంద్రకాంత్ సినిమా తీశాను. అంత రిస్క్ వద్దని ఎన్టీఆర్ గారు చెప్పినా వినలేదు. కానీ మంచి హిట్ కొట్టాను. ఇప్పుడు కన్నప్ప సినిమాను భారీ బడ్జెట్ తో తీశాను. శివుడి ఆజ్ఞతోనే ఈ సినిమా తీశానని అనిపిస్తోంది. ప్రస్తుతం చాలా మంది మమ్మల్ని ట్రోల్ చేస్తున్నారు. కానీ నేను వాటిని పట్టించుకోను. ట్రోల్ చేసేవారిని విమర్శించను. ఎందుకంటే ఆ క్షణం వారికి అలా అనిపిస్తోంది. కానీ మనం ఎవరిని తిట్టినా తిరిగి అది మనకే చెందుతుంది అనేది గుర్తు పెట్టుకోవాలి. కన్నప్ప సినిమా తర్వాత ఏదైనా మంచి పాత్రలు వస్తే కచ్చితంగా చేస్తాను. లేదంటే విద్యాలయాలు, పిల్లలను చూసుకుంటూ హాయిగా ఉండిపోతా' అంటూ చెప్పుకొచ్చారు మోహన్ బాబు.

# రెండు వారాల టైమ్ ఇస్తాం

**విశాఖపట్నం, ఏప్రిల్ 05, (హంస వాయిస్)**

విశాఖపట్నంలోని రామానాయుడు స్టూడియోకు నోటీసులు జారీ చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. రెండు వారాల సమయం ఇస్తామని, వారి వివరణ తర్వాత చర్యలు ఉంటాయని అన్నారు. "రామానాయుడు స్టూడియోకు చిత్ర నిర్మాణ పరిశ్రమ, స్టూడియో నిర్మాణం కోసం ప్రభుత్వం 34 ఎకరాలకు పైగా భూమిని కేటాయించింది. అందులో 15.17 ఎకరాలు హౌసింగ్ లేఅవుట్ కోసం మార్పు చేయాలని స్టూడియో యాజమాన్యం కోరింది. అది నిబంధనలకు విరుద్ధమని.. నోటీసులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది" అని కలెక్టర్ వివరించారు. రామానాయుడు స్టూడియోకు కేటాయించిన భూముల వ్యవహారంపై ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. నివాస స్థలాలుగా మార్పు చేయాలని తలపెట్టిన 15.17 ఎకరాల భూ కేటాయింపు రద్దు చేయాలని నిర్ణయించింది. నిర్దేశించిన ప్రయోజనం కోసం ఇచ్చిన భూమిని అప్రయోజనం కోసం వినియోగిస్తే రద్దు చేయాలన్న సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం.. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోదియా ఉత్తర్వులు జారీ చేశారు. సిసోదియా ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ తాజాగా నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమయ్యారు.

# కొండుపల్లిలోని గనిలో పేలుడు

**అనంతపురం, ఏప్రిల్ 05, (హంస వాయిస్)**

అనంతపురం జిల్లాలో ప్రమాదం చోటుచేసుకుంది. పెద్దవడుగూరు మండలం కొండుపల్లిలో పేలుడు సంభవించింది. భూగర్భ డోలమైట్ గనిలో ఈ పేలుడు ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని వెంటనే యాడికిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. భూగర్భ గనిలో పేల్చడానికి నిప్పు పెడుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. డోలమైట్ గనిలో ఉదయం నుంచి కార్మికులు పనిలో నిమగ్నమై ఉన్నారు. ఈ క్రమంలోనే ఉన్నట్లుండి భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో నలుగురు కార్మికులు గాయపడగా.. తోటి కార్మికులు వారిని ఆస్పత్రికి తరలించారు.

**కాలేజికి వెళ్లమన్నందుకు విద్యార్థి ఆత్మహత్య**

కాలేజీకి వెళ్లమన్నందుకు ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తాడిపత్రిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తాడిపత్రి పట్టణంలోని అంబాభవాని వీధికి చెందిన రంగయ్య, అమరావతిలకు హర్షత్‌సాయి అనే కుమారుడు ఉన్నాడు. హర్షత్ సాయి విజయవాడలోని ఓ కార్పొరేట్ కాలేజీలో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. అయితే ఉగాది సెలవుల కోసం హర్షత్‌సాయి ఇటీవల ఇంటికి వచ్చాడు. పండగ సెలవులు పూర్తైన తర్వాత కూడా హర్షత్ సాయి కాలేజీకి వెళ్లనని మారాం చేశాడు. అయితే అతని తల్లి బలవంతంగా అతన్ని విజయవాడ పంపించారు. ఏప్రిల్ 2న రాత్రి విజయవాడకు పంపించారు. అయితే హర్షత్ సాయి కళాశాలకు వెళ్లకుండా శుక్రవారం ఉదయానికల్లా తిరిగి ఇంటికి వచ్చేశాడు.

దీంతో హర్షత్ సాయి తల్లి కోపంతో అతన్ని మందలించింది. ఈ క్రమంలోనే శుక్రవారం మధ్యాహ్నం హర్షత్ సాయి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. హర్షత్ సాయి తండ్రి రంగయ్య దక్షిణాఫ్రికాలో ఉంటున్నారు. రంగయ్య పెద్దకుమారుడు ఆదిత్య కన్యాకుమారిలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. చిన్న కొడుకు హర్షత్ సాయి విజయవాడలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. అయితే బుద్ధిగా చదువుకోవాలని తల్లి మందలించగా.. క్షణికావేశంలో హర్షత్ సాయి ప్రాణాలు తీసుకోవడంతో ఆ తల్లి రోదిస్తున్న తీరు స్థానికులను కలిచివేస్తోంది.

# శ్రీవారి సేవలో పీఎం ముఖ్య కార్యదర్శి శక్తికాంతదాస్

**తిరుమల శ్రీవారిని ప్రధానమంత్రి రెండో ముఖ్యకార్యదర్శి శక్తికాంతదాస్ దర్శించుకున్నారు. శనివారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన కుటుంబసభ్యులతో కలిసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి తితిదే అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వారికి ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.**



# టీడీపీ వర్సెస్ జనసేన

పిఠాపురం, ఏప్రిల్ 05, (హంస వాయిస్)



పిఠాపురంలో ఆధిపత్య పోరు పీక్స్‌కు చేరింది. టీడీపీ వర్సెస్ జనసేన ఫైట్ మరింత ముదిరింది. పిఠాపురం మండలం కుమారపురం గ్రామంలో ఎమ్మెల్సీ నాగబాబు సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసైనికుల పోటా పోటీగా నినాదాలు చేసుకున్నారు. ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో.. పోలీసులు ఇరు పార్టీల వారిని చెదరగొట్టారు.

**సోషల్ మీడియాలో వార్..**

శుక్రవారం (ఏప్రిల్ 4న) కూడా నాగబాబు పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించారు. గొల్లప్రోలు దగ్గర సీఎస్ఆర్ ఫండ్స్‌తో హెల్త్ సెంటర్ నిర్మిస్తున్నారు. దానికి నాగబాబు శంకుస్థాపన చేశారు. అప్పుడు కూడా అక్కడ ఇరు పార్టీల నాయకులు నినాదాలు చేసుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన శిలాఫలకంపై చంద్రబాబు పేరు లేదనే పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ విషయంలో జనసేన, టీడీపీ కేడర్ మధ్య డైలాగ్ వార్ జరుగుతోంది.

**దూరంగా వర్మ..**

నాగబాబు పర్యటనకు టీడీపీ నేత వర్మ దూరంగా ఉన్నారు. దీంతో నాగబాబు వెళ్లిన ప్రతీచోట టీడీపీ కార్యకర్తలు నినాదాలు చేస్తున్నారు. ఈ వ్యవహారంపై నాగబాబు సీరియస్ అయినట్టు తెలుస్తోంది. ఇప్పుడే కాదు.. గతంలోనూ ఇలాంటి పరిస్థితులే కనిపించాయి. వర్మకు అన్యాయం జరిగిందని ఇక్కడి తెలుగుదేశం పార్టీ నాయకులు భావిస్తున్నారు.

**నాగబాబు కామెంట్స్..**

ఇటీవల జనసేన ఆవిర్భావ సభ జరిగింది. దీంట్లోనూ నాగబాబు వర్మను ఉద్దేశించి చులకనగా మాట్లాడారని.. పిఠాపురం నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకుడు ఒకరు చెప్పారు. అప్పటినుంచి టీడీపీ నాయకులు జనసేన కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నామని స్పష్టం చేశారు. తాటిపర్తి గ్రామంలోని అపర్ణ దేవి అమ్మవారి ఆలయ బాధ్యతల విషయంలోనూ రెండు పార్టీల మధ్య వివాదం జరిగింది.

**వివాదం ఏంటి..**

తాటిపర్తి అపర్ణ దేవి అమ్మవారి ఆలయానికి సంబంధించి.. గత పాలక కమిటీ ఆలయ బాధ్యతలను జనసేన నాయకులకు అప్పగించింది. దీనిని టీడీపీ వ్యతిరేకించింది. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ వివాదం కారణంగా పిఠాపురం టీడీపీ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మపై జనసేన కార్యకర్తలు దాడికి దిగారని వార్తలు వచ్చాయి. ఈ దాడిలో వర్మతో సహా పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటనతో పిఠాపురంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

# పవన్ భద్రాచలం వెళ్లట్లేదు

**అమరావతి, ఏప్రిల్ 05, (హంస వాయిస్)**



ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భద్రాచలం పర్యటన రద్దు చేసుకున్నారు. శ్రీరామనవమి సందర్భంగా రేపు భద్రాచలంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు. సీతారాముల కల్యాణం సందర్భంగా నేడు, రేపు పవన్ కల్యాణ్ భద్రాచలంలో పర్యటించాలని భావించారు. ఇందులో భాగంగా శనివారం హైదరాబాద్ లోని తన నివాసం నుంచి బయలుదేరి సాయంత్రం 5 గంటలకు భద్రాచలం చేరుకోవాల్సి ఉంది. రాత్రికి భద్రాచలంలో బస చేసి, రేపు సీతారాముల కల్యాణం సందర్భంగా ఏపీ ప్రభుత్వం తరఫున ముత్యాల తలంబ్రాలను సీతారాములకు సమర్పించాలని షెడ్యూల్ ప్రకటించారు.

**భక్తులకు ఇబ్బందులు తలెత్తకూడదనే!**

ఆదివారం సాయంత్రం 5 గంటలకు భద్రాచలం నుంచి తిరుగుపయనమై రాత్రి 10 గంటలకు హైదరాబాద్ చేరుకోవాలని పవన్ కల్యాణ్ ముందుగా భావించారు. అయితే భద్రాచలం పర్యటనను పవన్ కల్యాణ్ రద్దు చేసుకున్నారు. భద్రాచలం సీతారాముల కల్యాణం వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు వస్తారు. తన పర్యటనతో భక్తులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందేమోనని భావించిన పవన్ పర్యటనను రద్దు చేసుకున్నట్టు తెలుస్తోంది. పర్యటన రద్దుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వానికి ఇప్పటికే సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. చివరి నిమిషంలో అనివార్య కారణాలతో పవన్ పర్యటన రద్దు అయినట్లు ఇంటెలిజెన్స్ డీజీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పవన్ కల్యాణ్ పర్యటన రద్దు కావడంతో ఆయన అభిమానులు, జనసైనికులు నిరాశకు గురయ్యారు.

దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలంలో రేపు స్వామివారి కల్యాణం ఎంతో రమణీయంగా నిర్వహించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున సీఎం రేవంత్ రెడ్డి స్వామివారి పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందించనున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు భద్రాచలం సీతారాముల కల్యాణ వేడుకలో పాల్గొంటారు.

**ఒంటిమిట్టలో శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు**

ఏపీ భద్రాద్రి ఒంటిమిట్టలో శ్రీ రామనవమి బ్రహ్మోత్సవాలు ఎంతో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇవాళ సాయంత్రం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తారు. రేపు శ్రీ రామనవమి సందర్భంగా ధ్వజారోహణం ఉంటుంది. ఈ నెల 11న ఒంటిమిట్ట కోదండరాముడి కల్యాణోత్సవం నిర్వహిస్తారు. ఏపీ ప్రభుత్వం తరఫున సీఎం చంద్రబాబు పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలకు విశేషంగా విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఆలయంలో ప్రత్యేక క్యూలైన్లు, ఎండవేడిని తట్టుకునేలా చలువపందిళ్లు ఏర్పాటుచేశారు. ఆలయ పరిసరాల్లో బారికేడ్లు ఏర్పాటుచేశారు. ఆలయ గోపురాలు, కల్యాణవేదిక, ఇతర ప్రాంతాల్లో పుష్పాలంకరణలు, రంగురంగుల విద్యుత్ దీపాలు, విద్యుత్ కటౌట్లతో శోభాయమానంగా అలంకరించారు. భక్తుల కోసం అన్నప్రసాద వితరణ కౌంటర్లు తదితర ఏర్పాట్లు చేశారు.

# వీరరాఘవరెడ్డికి బెయిల్

**హైదరాబాద్, ఏప్రిల్ 05, (హంస వాయిస్)**

చిలుకూరు బాలాజీ టెంపుల్ అర్చకులు సీఎస్ రంగరాజన్‌పై దాడి చేసిన కేసులో ప్రధాన నిందితుడు వీరరాఘవ రెడ్డికి రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ.15 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. ఫిబ్రవరి 7న రంగరాజన్ ఇంటికి వెళ్లిన వీరరాఘవ రెడ్డి రామరాజ్య స్థాపన కోసం సైన్యాన్ని తయారు చేస్తున్నానని మద్దతు కోరాడు. ఆ సమయంలోనే రంగరాజన్‌పై దాడి జరిగింది. ఈ కేసులో వీరరాఘవ రెడ్డిని మొయినాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తాజాగా రాజేంద్రనగర్ కోర్టు అతనికి బెయిల్ మంజూరు చేసింది.

**రామరాజ్య స్థాపనకు మద్దతు కోరుతూ దాడి..**

రంగారెడ్డి జిల్లా చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్‌పై ఈ ఏడాది ఫిబ్రవరి 7న దాడి జరిగింది. 'రామరాజ్యం' అనే సంస్థకు చెందిన వీర రాఘవరెడ్డి నేతృత్వంలోని సుమారు 20 మంది సభ్యులు నల్లని దుస్తులు ధరించి రంగరాజన్ ఇంటికి వెళ్లారు. రామరాజ్యం స్థాపనకు మద్దతుగా ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు. రంగరాజన్ ఈ డిమాండ్లను తిరస్కరించడంతో దాడి చేశారు. ఈ దాడిలో రంగరాజన్‌కు గాయాలయ్యాయి. ఆయన కుమారుడు కూడా గాయపడ్డారు. ఈ ఘటన సీసీటీవీలో రికార్డైంది. అందుకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి.

ఈ ఘటనపై రంగరాజన్ కుటుంబ సభ్యులు మొయినాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాని ఆధారంగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. రంగరాజన్ తన ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. దాడి చేసినవారు తమను తాము ఇక్ష్వాకు వంశస్థులుగా చెప్పుకుంటూ.. 'రామరాజ్యం' స్థాపన కోసం పనిచేస్తున్నామని, ఆలయ బాధ్యతలను తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ ప్రతిపాదనను తిరస్కరించడంతో.. వారు కోపంతో దాడి చేశారు. రంగరాజన్ ఫిర్యాదు మేరకు ప్రధాన నిందితుడు వీర రాఘవరెడ్డిని ఫిబ్రవరి 8న అరెస్టు చేశారు. ఆ తర్వాత మరో 14 మందిని అరెస్టు చేసి జైలుకు పంపారు.

ఈ దాడిని తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు రాజకీయ ప్రముఖులు ఖండించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రంగరాజన్‌ను ఫోన్‌లో పరామర్శించి, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మాజీ మంత్రి కేటీఆర్ వంటి వారు కూడా ఈ దాడిని ఖండించారు. కేటీఆర్ స్వయంగా రంగరాజన్ ఇంటికి వెళ్లి ఆయన్ను పరామర్శించారు. ఏపీ మాజీ సీఎం జగన్ కూడా ఫోన్‌లో ఆయన్ను పరామర్శించారు. హిందూ సంఘాలు, భక్తులు దాడి ఘటనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటన తర్వాత ఆలయం వద్ద, రంగరాజన్
ఇంటి సమీపంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. తాజాగా ప్రధాన నిందితుడికి న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది.

# దేశంలో పుట్టిన ఏ వ్యక్తీ పేదోడుగా ఉండొద్దు

**ఎన్టీఆర్ జిల్లా, ఏప్రిల్ 05, (హంస వాయిస్)**



జగ్జీవన్‌రామ్ స్ఫూర్తితో కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రాభివృద్ధికి ఎప్పటికప్పుడు కొత్త ఆలోచనలు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా ముప్పాళ్లలో చంద్రబాబు పర్యటించారు. అక్కడ నిర్వహించిన బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో పాల్గొని నివాళి అర్పించారు. పీ4 కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాలతో సీఎం మాట్లాడారు.

"రాష్ట్రాభివృద్ధి కోసం ఎప్పటికప్పుడు కొత్త ఆలోచనలు చేస్తున్నాం. మహిళల కోసం డ్వాక్రా సంఘాలను తీసుకొచ్చాం. జన్మభూమి పిలుపునిచ్చినప్పుడు అందరూ స్పందించారు. ఆర్థికంగా పైకి వచ్చినవాళ్లు సమాజానికి ఎంతో కొంత ఇవ్వాలి. అట్టడుగున ఉన్నవారికి చేయూత ఇవ్వాలి. సమాజాన్ని ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తాను. నేనెప్పుడూ భవిష్యత్తు కోసం రాబోయే 2030 సంవత్సరాలకు ముందే ఆలోచిస్తా. దేశంలో పుట్టిన ఏ వ్యక్తీ పేదరికంలో ఉండటానికి వీల్లేదు. పేదరిక నిర్మూలన జరగాలి.. తలసరి ఆదాయం పెరగాలి. 2047 నాటికి ప్రపంచంలో భారత్ అగ్రగామిగా ఉంటుంది. పేదల సేవలో భాగంగా ఒకటో తేదీనే పింఛన్లు ఇస్తున్నాం. స్వయం ఉపాధి కింద అనేక పథకాలు తీసుకొచ్చాం" "గత ప్రభుత్వం మన నెత్తిన అప్పులు పెట్టి వెళ్లిపోయింది. సంపద సృష్టించాలి.. ఆదాయం పెంచాలి. సంక్షేమ కార్యక్రమాలు చేస్తూనే అభివృద్ధి చేయాలి. పీ4 కార్యక్రమం ఓ అద్భుతం. ప్రపంచంలో ఎక్కడా ఈ తరహా కార్యక్రమం జరగలేదు. ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయి, వీటిని తగ్గించాలి. పేదరికం మీరు తెచ్చుకున్నది కాదు. కానీ, దానిని అధిగమించాలి. అవకాశాలను అందిపుచ్చుకోవడం ముఖ్యం. 8 సార్లు ఎమ్మెల్యేగా, 15 సంవత్సరాలు సీఎంగా ఉన్నాను. నా రికార్డులు బద్దలు కొట్టడం సాధ్యం కాదు. డబ్బు వల్ల సమాజంలో గుర్తింపు రాదు. మంచిపని చేస్తేనే అది సాధ్యమవుతుంది. ఎస్సీల్లో వర్గీకరణ జరగాలని 30 ఏళ్ల క్రితం నిర్ణయించాం. పేదలు ఎక్కడ ఉంటే నేను అక్కడ ఉంటా. బాబు జగ్జీవన్‌రామ్ ఆశయాలను సాధిస్తాం. 'బాబు జగ్జీవన్‌రామ్' పథకం కింద ఎస్సీలకు 2 కిలోవాట్స్ సోలార్ విద్యుత్ అందిస్తాం. నూటికి నూరుశాతం ఎస్సీ, బీసీల పిల్లలకు గురుకుల విద్య అందిస్తాం. ఎస్సీల్లో నైపుణ్య శిక్షణ పెంపొందిస్తాం. అన్ని గ్రామాల్లో రోడ్లు బాగు చేశాం. ఇది మంచి మార్పు. వేదాద్రికంచల ఎత్తిపోతల పథకం పునరుద్ధరణ కోసం రూ.15 కోట్లు ఇస్తాం. రైతు సంఘాల ద్వారా పంటలు పండించే బాధ్యత తీసుకుంటాం. ఏటూరుమొగులూరు కాజ్‌వే నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు చేస్తాం. సుబాబుల్ రైతులకు న్యాయం చేస్తాం. తెదేపా ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కృషి చేసిన వారందర్నీ గౌరవించి ముందుకు తీసుకొస్తాం. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను లాభాల బాట పట్టిస్తున్నాం. రైల్వే జోన్‌ను సాధించాం. ఎవరికీ ఇబ్బంది లేకుండా పాలన సాగిస్తున్నాం. పీ4 ద్వారా మరిన్ని కార్యక్రమాలు సాధిస్తాం" అని చంద్రబాబు తెలిపారు.

# ఇంటర్ విద్యార్థులకు గుడ్‌న్యూస్

**అమరావతి, ఏప్రిల్ 05, (హంస వాయిస్)**



రాష్ట్రంలోని ఇంటర్ విద్యార్థులకు ఏపీఎస్ఆర్టీసీ గుడ్ న్యూస్ వినిపించింది. ఆంధ్రప్రదేశ్‌లో ఈసారి గతానికి భిన్నంగా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. గతంలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు పూర్తైన తర్వాత.. సెలవులు ఇచ్చేవారు. అయితే ఈసారి గతానికి భిన్నంగా ఏప్రిల్‌లోనే ఇంటర్ సెకండియర్ విద్యార్థులకు తరగతులు ప్రారంభించారు. 202526 విద్యా సంవత్సరాన్ని ఏప్రిల్ ఒకటో తేదీ నుంచే ఏపీ ప్రభుత్వం ప్రారంభించింది. దీనికి అనుగుణంగా ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు అడ్మిషన్లు నిర్వహిస్తున్నారు. అలాగే ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారు.

అయితే ఇంటి నుంచి కాలేజీకి వెళ్లి చదువుకునే విద్యార్థుల కోసం ఏపీఎస్ఆర్టీసీ బస్‌పాస్ సౌకర్యం కల్పిస్తున్న సంగతి తెలిసిందే. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు వెళ్లి చదువుకునే విద్యార్థులకు ఈ బస్‌పాస్‌లు ఎంతోగానో ఉపయోగపడతాయి. ప్రయాణించే దూరాన్ని బట్టి నెలవారీగా కొంత మొత్తం తీసుకుంటూ విద్యార్థులకు ఆర్టీసీ బస్‌పాస్‌లు అందిస్తూ ఉంటుంది. సాధారణంగా ఏటా జూన్ నుంచి మార్చి వరకు ఇంటర్ విద్యార్థులకు తరగతులు జరిగేవి. దీనికి అనుగుణంగానే ఆర్టీసీ యాజమాన్యం బస్ పాస్‌లు జారీ చేసేది. ఈ ఏడాది తరగతులు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రారంభించారు. అయితే ఈ విషయాన్ని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ఆర్టీసీకి సమాచారం అందించలేదు. దీంతో విద్యార్థులకు ఆర్టీసీ సిబ్బంది బస్‌పాస్‌లు ఇచ్చేందుకు నిరాకరించారు. దీంతో ప్రయాణ ఖర్చులు భరిస్తూనే తరగతులకు హాజరవ్వాల్సి వచ్చింది.

అయితే ఈ విషయమై మీడియాలో వార్తలు రావటంతో ఏపీఎస్ఆర్టీసీ అధికారులు స్పందించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలు రాసిన విద్యార్థులకు ఏప్రిల్ నెల కూడా రాయితీ బస్‌పాస్‌లు రెన్యువల్ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు అన్ని జిల్లాలు, డిపోల అధికారులకు ఆర్టీసీ యాజమాన్యం నుంచి ఆదేశాలు వెళ్లాయి. దీంతో విద్యార్థులకు భారం తప్పనుంది.

**ఇంటర్ పరీక్షా ఫలితాలు**

మరోవైపు ఇంటర్ పరీక్షా ఫలితాలు ఏప్రిల్ 12 నుంచి 15 మధ్య విడుదల చేయనున్నట్లు తెలిసింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఏప్రిల్ ఆరో తేదీ నాటికి వాల్యూయేషన్ పూర్తి చేయనున్నారు. ఆ తర్వాత కంప్యూటరీకరణ వర్క్ కోసం ఐదారు రోజులు సమయం పడుతుంది. వాట్సాప్‌లో హాల్ టికెట్లు విడుదల చేసిన విధంగానే వాట్సప్‌లోనే ఇంటర్ పరీక్షా ఫలితాలు విడుదల చేయనున్నారు. పీడీఎఫ్ రూపంలో మార్కులు ఇవ్వనున్నారు.

# ఎర్రగరుసు అక్రమ తవ్వకాలు వెలుగులోకి తెచ్చిన రిపోర్టర్ పై దాడి..!

- కరిడికొండ లో ప్రభుత్వ భూములును, కొండలు, గుట్టలు తవ్వి సొమ్ము చేసుకుంటున్న మాజీ ఆర్మీ అధికారి
- ఫోటోలు తీసిన పత్రిక రిపోర్టర్
- తీయడానికి నువ్వెవరు అంటూ విచక్షణా రహితంగా దాడి
- తీవ్ర గాయాలు, ఆసుపత్రికి తరలింపు
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు



**పత్తికొండ, ఏప్రిల్ 05 (హంస వాయిస్):**

సమాజంలో జరుగుతున్న అన్యాయాలను, అక్రమాలను వెలుగులోకి తెస్తున్న జర్నలిస్టుల పై రోజు రోజుకు దాడులు పెరిగి పోతున్నాయి. దేవనకొండ మండలంలో కరిడికొండ లో రిటైర్డ్ ఆర్మీ అధికారి ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఎర్రమట్టి తవ్వకాలు చేపడుతున్న విషయం తెలుసుకున్న రిపోర్టర్ భీమన్న ఫోటోలు, వీడియోలు తీశారు. ఇది తెలుసుకున్న రిటైర్డ్ ఆర్మీ అధికారి కన్నప్ప.. ఒక్క సారిగా రెచ్చిపోయారు. మీ స్థలంలో ఏమైనా తవ్వకాలు చేపట్టామా..? ప్రభుత్వ స్థలంలో తవ్వుకుంటే మీకేమి నొప్పి..? తవ్వుతాం..? అమ్ముకుంటాం..? అధికారులకు కూడా ఇస్తాం.. మధ్యలో మీకు ఏమి నొప్పి..? అడ్డం వస్తే జేసీబీ తో తొక్కించి చంపేస్తా..? అంటూ రెచ్చి పోయారు. అంతటితో ఆగలేదు.. రిపోర్టర్ భీమన్న పై విచక్షణా రహితంగా దాడిచేశారు. దీంతో భీమన్న తీవ్ర గాయాలపాలయ్యారు. బంధువులకు సమాచారం ఇవ్వడం తో వారు హుటాహుటిన వచ్చి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్లు చెప్పారు. జరిగిన విషయం పై పోలీసులకు కూడా భీమన్న ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫిర్యాదు స్వీకరించారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. అయితే ఈ దాడిపై జర్నలిస్టు సంఘాలు మండిపడుతున్నాయి. ప్రభుత్వ ధనాన్ని దోచుకుపోతున్నా ఉన్నతాధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడంపై పలు ప్రశ్నలకు తావిస్తోందన్నారు. ఈ అక్రమ రవాణా సంఘటనపై ఆర్డీవో, తాహసిల్దార్, ఇరిగేషన్ శాఖ అధికారులకు పలుమార్లు సమాచారం ఇచ్చిన పట్టించుకోకపోవడం అన్యాయమని జర్నలిస్టు సంఘాల నేతలు తెలిపారు. ఇలా విలేకరిని చూడకుండా దాడి చేయడం పట్ల జర్నలిస్టు సంఘాలు మండిపడ్డాయి. దాడి చేసిన జెసిబి యజమాని, రిటైర్డ్ ఆర్మీ అధికారి కన్నప్ప వీడియోలు, ఫోటోలు ఆధారలు వున్నాయి కనుక స్థానిక పోలీసు అధికారులు విచారణ చేసి వెంటనే కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్ పంపాలని అన్నారు జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు ఉధృతం చేస్తామని జర్నలిస్టుల సంఘాల నాయకులు హెచ్చరించారు.

# ఘనంగా మాజీ ఉప ప్రధాని జయంతి వేడుకలు



**ఆళ్లగడ్డ ఏప్రిల్ 5 (హంస వాయిస్):**

**స్వాతంత్ర సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల నేత దేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. అపుస్మా ఆళ్లగడ్డ నియోజకవర్గం అధ్యక్షులు టి అమీర్ భాష ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ ప్రభుత్వ వెనకబడిన తరగతుల సంక్షేమ బాలుర వసతి గృహంలో వసతి గృహ సంక్షేమ అధికారి ఎం సురేష్ మరియు విద్యార్థులతో కలిసి బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు . ఈ సందర్భంగా అపుస్మా అధ్యక్షులు అమిర్ భాష ఆయన సేవలను కొనియాడారు.**

# వేపుకుంటలో ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు..



**జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 5 (హంస వాయిస్ ప్రతినిధి)**

టీ నర్సాపురం మండలం వేపుకుంటలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు వేల్పుల శ్రీను మాదిగ బొట్టపాటి వంశీ మాదిగ ఆధ్వర్యంలో బాబు జగజీవన్ రామ్ 118 వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. తీన్మార్ డప్పులతో మేల తాళాలతో గ్రామంలో యువకులు, పెద్దలు విద్యార్థులు మహిళలు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి టీ నర్సాపురం జనసేన అధ్యక్షులు అడపా నాగరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబు జగజీవన్ రామ్ గొప్ప నాయకుడని ఆయన ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని, ఆయన ఎన్నో పదవులు అలంకరించి దేశ ఉప ప్రధానిగా పనిచేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్ చేసి మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో కంకిపాటి పవన్ మాదిగ, పోలిమేర దుర్గా ప్రసాద్ మాదిగ, కలపాల నాని మాదిగ, సింగి చావల చందన కిరణ్ మాదిగ, కోట రాజు మాదిగ, ఇంగిర్తి వినయ మాదిగ మాదిగ విద్యార్థులు యువకులు పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో..
# జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు..



**ఏలూరు, ఏప్రిల్ 5 (హంస వాయిస్ ప్రతినిధి)**

: ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం లో శనివారం బాబు జగజ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్ సూర్యచంద్రరావు, బాబు జగజీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిబ్బందికి మిఠాయిలను పంచారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అడ్మిన్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ 5 ఏప్రిల్ 1908, చంద్వా గ్రామం లో జన్మించినట్లు తెలిపారు. ఆయన భారత స్వాతంత్ర్య సమరయోధుడు ప్రముఖ రాజకీయ నాయకుడు స్వాతంత్ర్యం తర్వాత వివిధ కేంద్ర మంత్రి వర్గాలలో ముఖ్యమైన శాఖల మంత్రి గా పని చేసినట్లు పేర్కొన్నారు. 1971లో భారత్,పాకిస్థాన్ యుద్ధ సమయంలో రక్షణ మంత్రి గా సేవలందించారు అని అన్నారు. భారత వ్యవసాయ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. శ్రామిక హక్కుల కోసం పోరాడినట్లు పేర్కొన్నారు.చిన్నతనంలోనే కుల వివక్షను ఎదుర్కొన్నారు అన్నారు.సమానత్వం కోసం జీవితాంతం పోరాడినట్లు పేర్కొన్నారు.ప్రతి సంవత్సరం ఏప్రిల్ 5న ఆయన జయంతిని జాతీయ సమతా దినంగా జరుపుతారు అని, ఆది వారి గొప్పతనానికి చిహ్నం అని అదనపు ఎస్పీ అడ్మిన్ కొనియాడారు.కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పి చంద్రశేఖర్, ఎస్.బి ఇన్స్పెక్టర్ మల్లేశ్వర రావు, ఆర్.ఐ పవన్ కుమార్, ఆర్.ఎస్.ఐలు భాస్కర రావు, అమరేశ్వర రావు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా బాబు జగజ్జీవన్ రామ్ జయంతి వేడుకలు..



**మందకృష్ణ మాదిగ కు పాలాభిషేకం..**

**జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 5 (హంస వాయిస్ ప్రతినిధి) :**

జంగారెడ్డిగూడెం మాదిగ పేట ఆధ్వర్యంలో,నవచైతన్య అంబేద్కర్ యువజన సంఘం సారధ్యంలో బాబు జగజ్జీవన్ రామ్ 117 వ జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. మాదిగ యువతసారధ్యంలో పాత బస్టాండ్ బాబు జగజీవన్ రామ్ విగ్రహం వద్ద నుండి ఏలూరు రోడ్డు బాబు జగజీవన్ రామ్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణఅమలుకు కృషిచేసిన మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో దళిత మాదిగ పేట పెద్దలు, యువకులు, విద్యార్థులు,ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు కార్మిక సంఘాలు, ఎమ్మార్పీఎస్ మున్సిపల్ వర్కర్స్ అండ్ కార్మికులు, బోసు బొమ్మ సెంటర్ ముఠా వర్కర్స్ యూనియన్, ప్రజా ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు తీన్మార్ కళాకారులు పాల్గొన్నారు.

మాజీ జెడ్పిటిసి సభ్యులు ముప్పిడి శ్రీనివాసరావు అధ్యక్షతన సభ జరిగింది.

కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, ఆరో వార్డు కౌన్సిలర్ నేకూరి కిషోర్ కుమార్, ఏడో వార్డ్ కౌన్సిలర్ దిర్శిపోము ధనలక్ష్మి రాజేష్, 28వ వార్డు కౌన్సిలర్ కనుమూరి లావణ్య, గ్రామపెద్దలు పరిమి సత్తిపండు, జెట్టి సత్య ఆదిత్య, దళిత హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు లాగు రవిబాబు, మద్దిపాటి ఉదయ్, ముప్పిడి విష్ణు, కొత్తూరు బోసి బాబు, దుద్ది దుర్గారావు,బొబ్బర రాజ్ పాల్ కుమార్, కొరుకులూరి సత్యనారాయణ, మనిల్లి గంగరాజు, ముప్పిడి నాగేశ్వరరావు( పాదం) కొండపల్లి పండు, దున్న శివ, ఆరుగొల్లు చక్రవర్తి, దున్న శివ, కోనపాముల పండు, కోనపాముల వినయ్, ఉండ్రాజవరపు ఇశ్రాయేలు, వసంతాటి మంగరాజు, కొండపల్లి ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.





# మాకు కనీస వసతులు కల్పించండి సారూ....

- ఉపాధి కూలీల ఆవేదన

**డోన్ రూరల్, ఏప్రిల్ 5 (హంస వాయిస్):**

డోన్ ప్రాంతంలో ఉపాధి హామీ పథకం కింద పనిచేసే కూలీలకు కనీస వసతులు లేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కూలీలకు పని చేసే ప్రదేశంలో కనీసం నీడ, తాగునీరు వంటి వసతులు లేవని.ఎండలో పని చేసేటప్పుడు నీరు, నీడ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలుస్తోంది. కూలీలు తమకు కనీస వసతులు కల్పించాలని కూలీల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. పల్లెల్లో కూలీల వలసలను నివారించడంతో పాటు వారికి పని కల్పించి చేసిన పనికి తగినట్లుగా వేతనాలు ఇచ్చేలా కేంద్ర ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ప్రారంభంలో దశల వారీగా కూలీలకు గడ్డపారలు, మెడికల్ కిట్లు, టెంట్లు గుడారాలు తాగు నీరు లాంటి వసతులను కల్పించినప్పటికీ ఇప్పుడు రానునా వారికి ఎలాంటి సదుపాయాలను కల్పించడం లేదు.ఇది వరకు కూలీలు సొంతంగా గడ్డపార సమకూర్చుకుంటే రోజుకు రూ. 10, తాగు నీటి కోసం రూ.5అందజేసే వారు. కనీసం ఇప్పుడు పని ప్రదేశం లో కనీస వసతులు లేకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల ఎండలు తీవ్రంగా ఉండడంతో కూలీలు అస్వస్థతకు గురవుతున్నారు. వేసవిలో మార్చి నుంచి జూన వరకు కూ లీలకు వడదెబ్బ తగలకుండా నీడకోసం టెంట్లు వేసి రక్షణ కల్పించాల్సి ఉంటుంది. అలసటగా ఉంటే పొదలు, చెట్ల చాటున సేద తీర్చుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. కనీసం నీటిని సరఫరా చేయడానికి ఒక మేట్‌ను నియమిస్తే కూలీలకు సౌకర్యంగా ఉం టుంది. జిల్లా వ్యాప్తంగా ఉపాధి కూలీలకు వసతు లు లేకపోవడంతో ఎండలోనే సేద తీరుతున్నారు. కూలీలకు భోజనం చేయడానికి, అలసటగా ఉన్నప్పుడు సేద తీరడానికి ప్రభుత్వం గతంలో గుడారాలు, మెడికల్ కిట్లు పంపిణీ చేసేది. వాటిని క్షేత్ర సహాయకులు ప్రతీ రోజు పని ప్రదేశానికి తీసుకువెళ్లి వసతి కల్పించేవారు. ఆరు నుంచి ఏడు సంవత్సరాలుగా గుడారాలు, మెడికల్ కిట్లు ఇవ్వడం మరిచారు. కిట్టులో అయోడిన బాటిల్, బ్యాండేజి, దూది, ఓఆర్ఎస్ ప్యాకెట్లు కొన్ని రకాల మాత్రలు ఉండేవి. కూలీలకు వీటి ని కూడా ఏళ్ల తరబడి సమకూర్చడం లేదు. పనికి ఉపయోగించే పరికరాలు కూడా ఇవ్వడం లేదు. ప్రభుత్వం స్పందించి మెడికల్ కిట్లు, గుడారాలు ఏర్పాటు చేయాలని కూలీలు కోరుతున్నారు.

**ఎలాంటి వసతులు కల్పించడం లేదు..... : బద్దల బాలయ్య**



పని ప్రదేశంలో కూలీలకు ఎలాంటి పరికరాలను ఇవ్వడంలేదు. గతంలో టెం ట్లు,మెడికల్ కిట్లు ఇచ్చేవారు. ఇప్పుడు తాగడానికి నీరు కూడా మేమే తెచ్చుకుంటున్నాం. అలసట గా ఉంటే పొదలు, చెట్ల నీడన సేద తీరాల్సి వస్తోంది.

**తాగు నీరు సరఫరా చేయాలి....... : పెరుగు వెంకటేశ్వర్లు**



ఎండలు తీవ్రంగా కొడుతున్నాయి. పని ప్రదేశంలో ఎలాంటి వసతులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నాం. కనీసం నీటిని సరఫరా చేయడానికి ఒక మేట్ ను నియమిస్తే సౌకర్యంగా ఉంటుంది. ప్రభుత్వం పని ప్రదేశంలో వసతులు కల్పించాలి. ఉపాధి కల్పించేందుకు కేంద్రం దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఏ)లో కూలీల వేతనాల చెల్లింపులో ఆలస్యం జరుగుతుండటం పట్ల అధికారులు స్పందించాలి.

# రబీ సీజన్లో ధాన్యం కొనుగోలుకు 216 ధాన్యం కొనుగోలు కేంద్రాలు..



- మంత్రి కందుల దుర్గేష్ .. కేంద్రానికి ప్రారంభించిన మంత్రి..
- మోర్త గ్రామంలో ధాన్యం కొనుగోలు

**ఉండ్రాజవరం, ఏప్రిల్ 5 (హంస వాయిస్ ప్రతినిధి)**

ప్రస్తుత 2024 25 రబీ సీజన్ లో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు తూర్పు గోదావరి జిల్లాలో 216 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. శనివారం నుంచే తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా 216 కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. జిల్లాకి నిర్దేశించిన రెండు లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరణ పూర్తి స్థాయిలో సన్నద్ధం చేసినట్లు చెప్పారు. ఉండ్రాజవరం మండలం మోర్త గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని మంత్రి కందులు దుర్గేష్ ప్రారంభించారు. భారత ప్రభుత్వ సూచనల ప్రకారం రైతులకు కనీస మద్దతు ధరను ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం తరపున వ్యవసాయ క్షేత్రం నుంచే సేకరణ ద్వారా రైతుల నుండి వరిని సేకరిస్తున్నాం అన్నారు. వరి వెరైటీ రకాలకు కనీస మద్దతు ధర కల్పించే విధానంలో క్వింటాలు సాధారణ రకం 2,300 రూపాయలు , గ్రేడ్ ఏ రకం 2,320 రూపాయిలకు కొనుగోలు చేస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 58,586 హెక్టార్ల లో వరి సాగు జరిగినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# బాబు జగ్జీవన్ రామ్ స్ఫూర్తివంతమైన సేవలు అందించారు..

**రాజమహేంద్రవరం, ఏప్రిల్ 5 (హంస వాయిస్ ప్రతినిధి) :**



జిల్లా పోలీస్ కార్యాలయంలో భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి అడిషనల్ ఎస్పీ (ఏ ఆర్) ఎల్ చెవిరెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాడి అర్పించారు. ఈ సందర్భంగా ఎడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్‌భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలోనూ, స్వరాజ్యం వచ్చాక ఆధునిక భారత దేశ నిర్మాణంలోనూ స్ఫూర్తివంతమైన సేవలు అందించారని కొనియాడారు. తన జీవితమంతా సమసమాజ స్థాపన కోసం కృషిచేసిన వారి స్ఫూర్తిగా మనందరం బడుగువర్గాల అభ్యున్నతి కోసం కృషి చెయ్యాలని, జగ్జీవన్ రామ్ ఆశించిన సమాజాన్ని నిర్మిద్దాం అని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డి.ఎస్.పి(ఎస్.బి)బి. రామకృష్ణ, డి.ఎస్.పి(ఏ.ఆర్) రవి కుమార్, ఇన్స్పెక్టర్( ఎస్.బి) ఏ. శ్రీనివాసరావు, ఇతర పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# రొయ్యలపై అమెరికా దిగుమతి సుంకం రద్దు చేయాలి..

- నష్టాల్లో కూరుకుపోతున్న రొయ్యల రైతులను ఆదుకోవాలి..

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్..**



ఏలూరు, ఏప్రిల్ 5 (హంస వాయిస్ ప్రతినిధి) : మన దేశం నుండి అమెరికాకు ఎగుమతి అవుతున్న రొయ్యలపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దిగుమతి సుంకం 26 శాతం విధించడం దుర్మార్గమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు.స్థానిక అన్నే భవనంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు అధ్యక్షతన అమెరికా దిగుమతి సుంకాలు భారతదేశ వ్యవసాయ రంగంపై ప్రభావం అనే అంశంపై సమావేశం నిర్వహించారు. అమెరికా ప్రపంచ దేశాలపై దిగుమతి సుంకాల భారాలు వేయడం పట్ల నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తక్షణమే కలుగజేసుకుని ట్రంప్ విధించిన సుంకాన్ని రద్దు చేయించాలని కోరారు. లేదంటే ఆ ప్రభావం ఇక్కడి రొయ్యల గిట్టుబాటు ధరలపై పడుతుందన్నారు. ఇప్పటికే భారతదేశ రొయ్యలపై అమెరికా డంపింగ్ డ్యూటీ పేరుతో 3.88 శాతం, కౌంటర్ వయలింగ్ డ్యూటీ 5.77 శాతం విధించిందని, ట్రంప్ తాజాగా విధించిన సుంకంతో కలుపుకొంటే మొత్తం 35.65 శాతం భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఆక్వా రైతులు పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయారని చెప్పారు. అమెరికా నిర్ణయాలతో నష్టపోతున్న ఆక్వా రైతులను అన్ని విధాల ఆదుకునేందుకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆక్వాతో పాటు ఇతర పంటల రైతులు కూడా అమెరికా దిగుమతి సుంకం వలన నష్టపోతారని చెప్పారు. వ్యవసాయ రంగాన్ని రక్షించుకునేందుకు, నష్టపోతున్న రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వాలు తగు ప్రయత్నాలు చేయాలన్నారు. వ్యవసాయ ఉపకరణాల ధరలు తగ్గించాలని, రైతులకు సబ్సిడీలు ఇవ్వాలని కోరారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయాలకు రైతాంగం, ప్రజలు వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు.



# నికోబార్‌లో నమ్మకద్రోహం

సమాజాన్ని ప్రభావితం చేసే అంశాలపై బహిరంగ చర్చలలో ఏ పదమూ, 'జాతీయ మీడియా'లా భ్రమలు కల్పించదు, తప్పదోవ పట్టించదు. జాతీయ మీడియాగా పరిగణన పొందుతున్న వార్తాపత్రికలు, మ్యాగజైన్లు, టీవీ ఛానెల్స్ ఆలోచనా రీతులు సంకుచిత పరిధిలోనే ఉండిపోతున్నాయి. సైద్ధాంతిక, పక్షపాత గంతలు కట్టుకుని వాస్తవాలను చూస్తున్నాయి. జాతీయ రాజధాని ప్రాంతం (నేషనల్ క్యాపిటల్ రీజియన్) నుంచి, తరచు ఎన్‌సిఆర్ నుంచి మాత్రమే మన సువిశాల భారతదేశ సంఘటనలు, పరిణామాలను అవి చూస్తున్నాయి. అధికార పీఠానికి అన్ని విధాల చేరువలో ఉండడం వాటిని ప్రలోభపరుస్తుంది, సంతృప్తి పరుస్తుంది. కనుకనే వార్తాపత్రికల సంపాదకీయ పుటలో కేంద్ర కేబినెట్ మంత్రుల వ్యాసాలు తరచు ప్రచురితమవుతుంటాయి. ఇక టెలివిజన్‌లో భారతావని విలక్షణ వైవిధ్యం భిన్న పార్టీలకు చెందిన రాజకీయ వేత్తల మధ్య అరుపులు, కేకల వ్యవహారానికి పరిమితమవుతోంది! ఈ కారణంగానే మన సువిశాల మాతృభూమి వేర్వేరు ప్రాంతాలలోని విభిన్న సామాజిక సముదాయాల జీవనస్థితిగతులపై నిశిత, సమగ్ర అధ్యయనాలకు సంబంధించిన కథనాలకు 'జాతీయ' వార్తాపత్రికలలో అల్ప ప్రాధాన్యం మాత్రమే లభిస్తుండగా, 'జాతీయ' టెలివిజన్‌లో అసలు ప్రస్తావనకే నోచుకోవడం లేదు! 'జాతీయ మీడియా'పై నా సంశయాలు సంవత్సరాలుగా పెరుగుతూనే ఉన్నాయి.

అవి సహేతుకమైనవని పెద్ద ఎత్తున వెల్లడవుతోన్న ఒక జాతీయ కళంకం గురించిన రెండు ప్రశస్త వ్యాస సంకలనాలు ధ్రువపరిచాయి. మరి ఎన్‌సిఆర్‌లోని ఏ టెలివిజన్ స్టూడియోలోను ఆ విషయమై ఎన్నడూ ఎలాంటి చర్చ కనీస మాత్రంగానైనా జరగలేదు. జరగగలదనే ఆశాభావానికి సైతం ఆస్కారం లేదు. నేను ప్రస్తావించిన లజ్జాకర విషయం గ్రేట్ నికోబార్ దీవిలో ప్రణాళికా బద్ధ విధ్వంసం. చెన్నై నుంచి వెలువడే ఫ్రంట్ లైన్ మ్యాగజైన్ (3 మార్చి, 2025 సంచిక), పంకజ్ సేఖ్సారియ సంకలనం చేసిన వ్యాస సంపుటంలో ఆ అంశంపై నిశిత, విపుల వ్యాసాలు ఉన్నాయి. పంకజ్ సంకలనం 'The Great Nicobar Betrayal' ఒక దుర్బల దీవిని ప్రభుత్వం బుద్ధిపూర్వకంగానే విపత్తులోకి నెట్టివేస్తోందని పేర్కొంది. పంకజ్ స్వయంగా అండమాన్ నికోబార్ దీవులలో పలు సంవత్సరాల పాటు పరిశోధన నిర్వహించారు. ఆయన సంకలనంలోని వ్యాస రచయితలకు కూడా ఆ దీవుల స్థితిగతుల గురించి పరిశోధనల రూపేణా ప్రత్యక్ష పరిజ్ఞానం ఉన్నది. కేంద్ర ప్రభుత్వం అమలుపరుస్తున్న ప్రాజెక్టుతో గ్రేట్ నికోబార్ దీవికి అనేక ప్రమాదాలు పొంచి ఉన్నాయని ఆ వ్యాసాలు అన్నీ స్పష్టం చేశాయి ప్రస్తుతం ఆ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.80,000కోట్లు. ఇది ఇంకా తప్పకుండా పెరుగుతుందని నిశ్చితంగా చెప్పవచ్చు. ఈ దుర్బల దీవిలో ఒక నౌకాశ్రయం, ఒక అంతర్జాతీయ విమానాశ్రయం, భారత్ ప్రధాన భూభాగం నుంచి వలసవెళ్లే లక్షలాది ప్రజల ఆవాసానికిగాను ఒక పట్టణాన్ని ఆ ప్రాజెక్టులో భాగంగా నిర్మించనున్నారు. 910 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న గ్రేట్ నికోబార్ దీవి నికోబార్ దీవుల సముదాయంలో చాలా పెద్దది. 'అండమాన్, నికోబార్' అనే ద్వీప సముదాయంలో భాగంగా ఉన్న గ్రేట్ నికోబార్ భూకంపాలకు ఆస్కారమున్న ప్రాంతం. ఈ దీవిలో గత దశాబ్దంలో 400కు పైగా భూకంపాలు నమోదయ్యాయి. 2004లో గ్రేట్ నికోబార్ సునామీ తాకిడికి గురయింది. దీవి అంతా ధ్వంసమయింది.

ఆ దీవివాసులు అయిన ఆదివాసీలలో అనేక మంది సునామీలో కొట్టుకుపోయారు. మరెంతో మంది పూర్తిగా నిరాశ్రయులయ్యారు. ఆ సముద్ర ఉత్పాతం ఊహించని, ఆకస్మిక పరిణామం. అయితే ఇప్పుడు అమలవుతున్న కొత్త ప్రాజెక్టు ప్రభుత్వం ఒక విపుల ప్రణాళికతో ఆ దీవి ప్రాకృతిక, సాంస్కృతిక సమగ్రతపై సంకల్పించిన దాడి! అవును, అక్షరాలా దౌర్జన్యమే, సందేహం లేదు. నౌకాశ్రయ నిర్మాణంతో అరుదైన భారీ తాబేళ్ల ఆవాస ప్రదేశాలన్నీ ధ్వంసమవుతాయి. ఇంకా పర్యావరణానికి ఎనలేని నష్టం వాటిల్లుతుంది. నిర్మించనున్న పుర నివేశం (టౌన్‌షిప్)తో 130చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలోని కోటికి పైగా వృక్షాలు ఉన్న దట్టమైన అడవి అంతరించిపోతుంది. ఈ దీవి చాలా అరుదైన, స్థల విశిష్ట వృక్ష, కీటక, పక్షి, జంతు జాతులు, సరీసృపాలకు నెలవు. ఈ జీవ వైవిధ్యమంతా నాశనమై పోతుంది. ఇదంతా పర్యావరణ పరమైన హాని కాగా సామాజిక మూల్యాలు అంతే తీవ్రమైనవి. అసలే దుర్బలురు అయిన ఆ దీవి మూలవాసులు అందరూ మరింతగా పేదరికంలోకి జారిపోతారు. గిరిజన సముదాయాలను కాపాడాలనే రాజ్యాంగ నిర్దేశాలు పూర్తిగా ఉల్లంఘనకు గురవుతాయి. గ్రేట్ నికోబార్‌లో ప్రస్తుతం 8500 మంది నివసిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అమలయితే జనాభా సంఖ్య 40 రెట్లు పెరుగుతుంది. ఆ దీవి సంస్కృతి, పర్యావరణంపై భారతదేశ ప్రధాన భూభాగం నుంచి జనాభా వలసల ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుంది. ఆ మార్పు చాలా హానికరంగాను, మార్చలేనిదిగాను ఉంటుందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

అండమాన్ నికోబార్ దీవులలో విస్తృతంగా క్షేత్ర పరిశోధనలు చేసిన అజయ్ సైని, అన్విత అబ్బి ఇటీవల ఒక వ్యాసంలో ఇలా రాశారు: 'గ్రేట్ నికోబార్ మెగా ప్రాజెక్టు కేవలం ఒక పర్యావరణ విపత్తు మాత్రమే కాదు; అభివృద్ధి పేరిట జరుగుతున్న ఉద్దేశపూర్వక, భయంకర, భాషాసంబంధి, సాంస్కృతిక జాతి సంహారం'. ఈ మెగా ప్రాజెక్టు గ్రేట్ నికోబార్‌ను సామాజిక నిర్మాణాలను పర్యావరణ వ్యవస్థలనూ పూర్తిగా ధ్వంసంచేస్తుంది. ఆర్థిక లబ్ధిపరంగా చూసిన అది సమర్థనీయమైన ప్రాజెక్టు కానేకాదు. ఫ్రంట్‌లైన్‌లో వెలువడిన ఒక వ్యాసం శీర్షిక 'The numbers do not add up' (సంఖ్యలు కలిసిరావు) ఆ వాస్తవాన్ని ప్రభావదాయకంగా చెప్పింది. నౌకాశ్రయం, పర్యాటక రంగం నుంచి సంభావ్య రాబడి పెద్దగా ఉండదని, ఆ ప్రాజెక్టును ఆర్థికంగా ప్రయోజనకరంగా చేయదని రాజశేఖర్ వ్యాఖ్యానించారు. మౌలిక సదుపాయాలను అభివృద్ధిపరిచేందుకు భారీ ధనరాశులను ఉపయోగించడం వాస్తవంగా ప్రైవేట్ కార్పొరేట్ ప్రయోజనాలకు దోహదం చేస్తుందని ఆయన అన్నారు. ఈ వ్యాసాలను చదవడం ద్వారా ఆ దీవి పర్యావరణాన్ని పరిరక్షించి సుస్థిరాభివృద్ధిని ప్రోత్సహించవలసిన శాసన విహిత బాధ్యతలు ఉన్న ప్రభుత్వ సంస్థలు, ఆదివాసీల హక్కులను రక్షించవలసిన రాజ్యాంగ బాధ్యత ఉన్న అధికారులు తమ విధ్యుక్త ధర్మాలను ఎలా విస్మరిస్తున్నారో దిగ్భ్రాంతి గొలుపుతుంది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ, భారతీయ వన్యప్రాణుల సంస్థ, నీతి ఆయోగ్, గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ క్షేత్ర వాస్తవాలను జాగ్రత్తగా పరిశీలించకుండా, సాధ్యాసాధ్యాలను నిర్దుష్టంగా అంచనా వేయకుండా మెగా ప్రాజెక్టుకు అవసరమైన అనుమతులను ఎంత నిరాలోచనగా మంజూరు చేశాయో పంకజ్ సంకలన గ్రంథం, ఫ్రంట్‌లైన్‌లోని వ్యాసాలు విపులంగా వివరించాయి.

ఈ హానికర వ్యవహారంలో గౌరవనీయ శాస్త్రవేత్తలు సైతం భాగస్వాములు కావడం కలవరం కలిగిస్తోంది. బాంబే నేచురల్ హిస్టరీ సొసైటీ మాజీ డైరెక్టర్ ఒకరు 2018లో ఈ మెగా ప్రాజెక్టుకు ఆక్షేపణ తెలుపడాన్ని పంకజ్ తన వ్యాసంలో ప్రస్తావించారు. 'చాలా ఆందోళనకరమైన ప్రాజెక్టు అని, దాన్ని అమలుపరిస్తే ప్రపంచ సాగర జీవవైవిధ్యపు అరుదైన ప్రదేశాలు పూర్తిగా ధ్వంసమవుతాయని' ఆ శాస్త్ర వేత్త అన్నారు. 'గ్రేట్ నికోబార్ జీవ వైవిధ్యాన్ని యథాతథంగా పరిరక్షించాలని, ఆ దీవి స్వతస్సిద్ధ పర్యావరణ వనరులను జాతీయ ఆస్తులుగా పరిరక్షించాలని ఆ శాస్త్రవేత్త సూచించారు.

# ముస్లింలపై మరో దాడి

స్వాతంత్ర్య తొలి దశాబ్దంలో తీసుకువచ్చిన వక్ఫ్ చట్టం–1954ను రద్దు చేస్తూ పార్లమెంటు 1995లో కొత్త వక్ఫ్ చట్టాన్ని ఆమోదించింది. ఈ చట్టానికి 2013లో ప్రధాన సవరణలు చేశారు. జరిగిన సవరణలు 57 అని నా లెక్కలో తేలింది. దాదాపు 12 సంవత్సరాలు గడిచిపోయాయి. ఎవరి ప్రయోజనాల కోసమయితే ఆ చట్టాన్ని చేశారో వారు ఏమైనా ఫిర్యాదులు చేస్తే వాటి ఆధారంగా కొత్త సవరణలు తప్పనిసరి అని లేదా లాభదాయకమని ప్రభుత్వం విశ్వసించిన పక్షంలో సవరణల బిల్లు ద్వారా సదరు చట్టంలో సంస్కరణలు తీసుకురావచ్చు. అయితే వక్ఫ్ (సవరణ) బిల్లు–2025 చేసింది వక్ఫ్ చట్టాన్ని సంస్కరించడం ఎంత మాత్రం కాదు. అందుకు విరుద్ధంగా ప్రస్తుతమున్న చట్టాన్ని, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తన సొంత ఉద్దేశాలతో గుర్తించడానికి వీలు లేకుండా వికృతం చేసింది. ఒక అసమగ్ర చట్టాన్ని తీసుకువచ్చింది. బహుళ మతాలు విలసిల్లుతున్న ఒక ప్రజాస్వామిక దేశంలో గౌరవించవలసిన మొదటి సూత్రం అన్ని మతాలు సమానమే అన్నది కాదూ? ఏదైనా ఒక మతానికి చెందిన మత సంస్థల నిర్వహణ అనేది విధిగా అదే మతస్థుల చేతుల్లో ఉండితీరాలి. హిందూ మతస్థులు అత్యధికంగా ఉన్న భారత్‌లో ఆ సూత్రం హిందూ దేవాదాయ, ధర్మాదాయ సంస్థలు అన్నిటికీ ఎటువంటి మినహాయింపు లేకుండా వర్తింప చేస్తున్నారు. 'మైనారిటీ' మతాల విషయంలోనూ ఈ సూత్రాన్ని భారత రాజ్యాంగం ప్రకారం




వర్తింప చేస్తున్నారు.

మత సంస్థల నిర్వహణలో స్వేచ్ఛ అనే విషయమై భారత రాజ్యాంగ అధికరణ 26 ఇలా నిర్దేశించింది: 'ప్రజా సంక్షేమం, ఆరోగ్యకరమైన నైతికతలకు లోబడి మత సంస్థల నిర్వహణకు సంబంధించి ప్రతి మతానికి ఈ క్రింద ఉదహరింపబడిన స్వేచ్ఛ ఉంటుంది- మత, ధార్మిక సంస్థల సంస్థాపన, నిర్వహణ; మత విషయాల సంబంధిత కార్యకలాపాలను తమకుతామే నిర్వహించుకొనుట; స్థిర, చరాస్తులను సమకూర్చుకొనుట; చట్టం ప్రకారం సదరు స్థిర, చరాస్తుల నిర్వహణ. హిందూ మత సంస్థలు, దాతృత్వ సంస్థల పాలనా వ్యవహారాలను హిందువులు మాత్రమే నిర్వహిస్తున్నారు. హిందూ దేవాలయాలు, మత సంస్థలు, దాతృత్వ సంస్థల నిర్వహణ, పాలనా వ్యవహారాలలో హిందూయేతరులకు పాత్ర కల్పించాలని ఎవరూ సూచించరు, హిందువులు ఎవరూ అటువంటి సూచనను అంగీకరించబోరు. ఇది స్పష్టం. (అసలు హిందూయేతరులు ఎవరినీ తిరుమల-తిరుపతి దేవస్థానంలో కనీసం ఉద్యోగులుగా కూడా నియమించకూడదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డిమాండ్ చేశారు). ఇతర మతాలకు చెందిన కోట్లాది అనుయాయులు కూడా అదే అభిప్రాయాన్ని కలిగివున్నారు. ప్రస్తుతం హిందూ, క్రైస్తవ, సిక్కు, బౌద్ధ మతాలకు సంబంధించిన ఆరాధనా మందిరాలు, దాతృత్వ సంస్థలలో ఏ ఇతర మతానికి చెందిన వ్యక్తికి పాత్ర కల్పించేందుకు చట్టాలు అనుమతించడం లేదు. వక్ఫ్ చట్టం-1995 కింద ఆ సూత్రాన్ని నిష్ఠాబద్ధంగా పాటించారు. వక్ఫ్ అంటే ముస్లిం చట్టం గుర్తించిన ధార్మిక, మత, దాతృత్వ కార్యకలాపాల కోసం ఏ వ్యక్తి అయినా ఆస్తిని శాశ్వతంగా సమర్పించడం. ముస్లిమేతరులు సృష్టించిన వక్ఫ్‌లను సైతం న్యాయస్థానాలు గుర్తించడం జరిగింది. ఇందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి.

అంతేకాకుండా ప్రస్తుతమున్న చట్టం ప్రకారం ఒక వక్ఫ్ అనేది చాలవరకు స్వతంత్ర, స్వయంపాలిత ఆస్తి. రాష్ట్రాల స్థాయిలో వక్ఫ్ ఆస్తుల నియంత్రణకు అత్యున్నత సంస్థ వక్ఫ్ బోర్డు. ఇందులో సభ్యులు అందరూ విధిగా ముస్లింలే ఉంటారు. ఛీఫ్ ఎక్జిక్యూటివ్ అధికారి సైతం ముస్లిమే అయివుండాలి. ఈ బోర్డు తన అధికారాలను వక్ఫ్ ఆదేశాలకు, వక్ఫ్ లక్ష్యాలకు, వక్ఫ్ ఆచారాలు, ఉపయోగాలకు అనుగుణంగా చెలాయించాలి. వక్ఫ్ ఆస్తులపై న్యాయ నిర్ణయాలు తీసుకునే అధికారం ఒక ట్రిబ్యునల్‌కే ఉంటుంది. ఈ న్యాయాధికార సంస్థకు జిల్లా జడ్జి చైర్‌పర్సన్‌గా ఉంటారు. వివాదాస్పద సవరణ బిల్లు ఎంతో కాలంగా ఉన్న సూత్రాలు, ఆచరణలను తలకిందులు చేసింది: (1) 'ఏ వ్యక్తి అయినా' ఒక వక్ఫ్‌ను సృష్టించలేదు; కనీసం ఐదు సంవత్సరాలుగా ఇస్లాంను ఆచరిస్తున్నానని నిరూపించిన వ్యక్తి మాత్రమే ఒక వక్ఫ్‌ను సృష్టించాలి. ఎందుకు? ఒక వ్యక్తి తాను ఇస్లాంను ఆచరిస్తున్నానని ఎలా నిరూపించాలి? సమాధానం లేదు. (2) ఒక వక్ఫ్ సృష్టికర్త తన చర్యవెనుక ఎటువంటి 'వంచనాపూర్వక ఎత్తుగడ' లేదని నిరూపించాలి. 'వంచనాపూర్వక ఎత్తుగడ' అంటే ఏమిటి? సమాధానం లేదు; (3) వక్ఫ్‌గా సమర్పించిన ఆస్తి 'ప్రభుత్వ' ఆస్తి అని వాదన వస్తే దాని నిజానిజాలపై సీనియర్ ప్రభుత్వాధికారి విచారణ నిర్వహించాలి.

సదరు వక్ఫ్ ప్రభుత్వ ఆస్తి అవునో కాదో ఆ విచారణాధికారి నిర్ణయిస్తాడు. ప్రభుత్వ ఆస్తి అని నిర్ధారించిన పక్షంలో ఆ అధికారి అందుకు సంబంధించి రెవెన్యూ రికార్డులలో సవరణలు చేయాలి. ఇది న్యాయమూర్తి తన సొంత కేసులో తానే తీర్పు ఇవ్వడం'లాంటిది కాదా? ఈ ప్రశ్నకూ సమాధానం లేదు. (4) రాష్ట్ర వక్ఫ్ బోర్డు సభ్యులు ముస్లింలే అయి ఉండాలన్న నిబంధనను తొలగించారు. ఈ ప్రకారం ముస్లిమేతరులను కూడా వక్ఫ్ బోర్డులో నియమితులవుతారు. మరి దురుద్దేశాలతో వ్యవహరించే ఒక ప్రభుత్వం ముస్లిమేతరులనే ఎక్కువగా వక్ఫ్ బోర్డు సభ్యులుగా నియమించవచ్చు. ఇదొక తిరోగామి నిబంధన. మరి దీన్ని ఇతర మతాల సంస్థల పాలనావ్యవహారాలకు కూడా వర్తింపచేస్తారా? హిందూ మత/దాతృత్వ సంస్థలలో హిందూయేతరులను నియమిస్తారా? సమాధానం లేదు; (5) వక్ఫ్ (సవరణ) బిల్లు నమూనా అద్వితీయమైనది. దీని స్ఫూర్తితో ఇతర మతాల సంస్థలకు సంబంధించిన చట్టాలలో కూడా సవరణలు చేస్తారా? బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ముస్లింలపై దాడిని జాతీయ పౌరుల పట్టిక/పౌరసత్వ సవరణ చట్టంతో ప్రారంభించింది. ఉమ్మడి పౌర స్మృతిని తొలుత ఉత్తరాఖండ్‌లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టారు. ముస్లింలు మెజారిటీగా ఉన్న ఏకైక రాష్ట్రం జమ్మూ-కశ్మీర్‌ను విభజించి కేంద్ర పాలిత ప్రాంతాల స్థాయికి కుదించారు. 2019-20 నుంచి 2023-24 దాకా మైనారిటీలకు మొత్తం రూ.18,274 కోట్ల మేరకు బడ్జెట్ కేటాయింపులు చేశారు. అయితే ఆ మొత్తంలో రూ. 3,574 కోట్ల ఖర్చు పెట్టనే లేదు. మౌలానా ఆజాద్ ఫెలోషిప్ ఫర్ మైనారిటీ స్టూడెంట్స్‌తో సహా ముస్లింలకు అందిస్తున్న విద్యాసంబంధ సహాయాన్ని నిలిపివేశారు. వక్ఫ్ (సవరణ) బిల్లు ముస్లిం మతస్థులపై మరో దాడి, సందేహం లేదు. అదొక దుష్టయోచన ఫలితమని స్పష్టమవుతోంది. గత ఏడాది 18వ లోక్‌సభ ఎన్నికలలో ఓటర్లు తమకు ఇచ్చింది 240 సీట్లు మాత్రమే అయినప్పటికీ ప్రజల వైఖర్లు, అభిప్రాయాలు ఏమీ మారలేదని భారతీయ జనతా పార్టీ భావిస్తోంది. 17వ లోక్‌సభ కాలంలో అనుసరించిన రాజకీయ అజెండానే జాతీయ పాలక పార్టీ ఇప్పుడూ ఔదల దాల్చుతోంది. మార్పులేని ఆ అజెండానే అమలు పరిచేందుకు బీజేపీ నిశ్చయించుకుంది. అందులో భాగమే పార్లమెంటు ఉభయ సభలు ఆమోదించిన కొత్త వక్ఫ్ చట్టం.

# భారత్‌పై బంగ్లా కుతంత్రం

బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ సారథి మహమ్మద్ యూనస్ చైనా పంచన చేరిపోవాలని తెగ ఉబలాటపడుతున్నారు. గత నెలలో బీజింగ్‌ను సందర్శించిన ఆయన విస్మయకర ప్రకటన చేశారు. భారత్‌లోని ఏడు ఈశాన్య రాష్ట్రాలకు అసలు సముద్ర తీరమే లేదని, అక్కడి నుంచి బంగ్లాదేశ్ మీదుగానే సముద్రానికి చేరాల్సి ఉంటుందని అసందర్భంగా వ్యాఖ్యానించారు. యూనస్ వైఖరిని మన రాజకీయ పార్టీలన్నీ ముక్తకంఠంతో ఖండించాయి.



బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా నిరుడు ఉద్యమకారుల ధాటికి దేశం విడిచి భారత్‌లో ఆశ్రయం పొందారు. ఆ తరవాత మహమ్మద్ యూనస్ తాత్కాలిక ప్రభుత్వ సారథిగా పగ్గాలు చేపట్టారు. అప్పటి నుంచి భారత్‌బంగ్లా సంబంధాలు వేగంగా క్షీణిస్తూ వచ్చాయి. హసీనా భారత్, చైనాలతో సమతౌల్య సంబంధాలను కొనసాగించారు. ఆమె ప్రభుత్వం చైనా నుంచి ఆర్థిక సాయం పొందుతూనే భారతదేశ భద్రతా ప్రయోజనాలకు భంగం కలగకుండా నడుచుకుంది. హసీనా హయాంలో భారత్‌బంగ్లా మధ్య నాలుగు వేల కిలోమీటర్ల పొడవైన సరిహద్దు వెంబడి బందోబస్తు చక్కగా జరిగింది. ఉభయ దేశాల మధ్య రైలు, రోడ్డు, జలమార్గాల అనుసంధాన ప్రాజెక్టులు చేపట్టారు. చైనాతో దోస్తీ కోసం ఇండియాతో మైత్రిని పణంగా పెట్టబోమని హసీనా స్పష్టీకరించారు. తాను భారతదేశానికి నమ్మకస్తురాలైన నేస్తాన్నని నిరూపించుకున్నారు. దీనికి భిన్నంగా యూనస్ డ్రాగన్‌కు వత్తాసు పలుకుతున్నారు.

**చైనా పట్టించుకుంటుందా?**

యూనస్ తన చైనా పర్యటన సందర్భంగా భారతదేశ ఈశాన్య రాష్ట్రాల ప్రస్తావన తీసుకురావడం ఎందుకనే ప్రశ్న తలెత్తుతోంది. వాటికి సముద్ర తీరం లేదనడమే కాకుండా ఇది చైనాకు మహదావకాశమని, బంగ్లాలో పెట్టుబడులు పెట్టి ఉత్పత్తి సాగించవచ్చని ఆయన అన్నారు. చైనా వస్తువులను బంగ్లా మీదుగా విదేశాలకు ఎగుమతి చేయవచ్చనీ, విదేశాల నుంచి దిగుమతయ్యే సరకులను చైనాకు తీసుకెళ్లవచ్చనీ యూనస్ చెప్పుకొచ్చారు. అంతేకాకుండా, తమ దేశంలో వైమానిక స్థావరాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా చైనాను ఆయన ఆహ్వానించినట్లు వార్తలు వచ్చాయి. యూనస్ ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాధినేతేమీ కాదు. బంగ్లాలో ఎన్నికలు జరిగి కొత్త ప్రభుత్వం ఏర్పడితే ఆయన దిగిపోవాల్సిందే. అలాంటి వ్యక్తి ప్రతిపాదనలను చైనా పెద్దగా పట్టించుకోవడం అనుమానమే. అదీకాకుండా ట్రంప్ అధ్యక్షుడైన తరవాత చైనాకు అమెరికా నుంచి ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఇండియాతో సంబంధాలను పటిష్ఠం చేసుకోవాలని డ్రాగన్ ఆరాటపడుతోంది. భారత్‌చైనా దౌత్య సంబంధాలు చిగురించి 75 ఏళ్లు అయిన సందర్భంగా రాష్ట్రపతి ముర్ముకు పంపిన అభినందన సందేశంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తన అభిమతాన్ని బలంగా వ్యక్తీకరించారు. డ్రాగన్(చైనా), ఏనుగు(భారత్)ల మధ్య టాంగో నృత్యం(ఇద్దరి నర్తనం) ద్వైపాక్షిక సంబంధాల వృద్ధికి, బహుళ ధ్రువ ప్రపంచ సాధనకు అవసరమని ఆయన ఉద్ఘాటించారు. ఇలాంటి సానుకూల వాతావరణాన్ని చెడగొట్టడానికీ, భారత్, చైనాల మధ్య విభేదాలు పెంచడానికి యూనస్ ప్రయత్నిస్తున్నారు. ఆయన వ్యవహారంపై భారత ప్రభుత్వం వ్యూహాత్మక మౌనం పాటిస్తోంది.

**ప్రత్యామ్నాయం ముఖ్యం**

యూనస్ చైనాతోపాటు పాకిస్థాన్‌నూ భారత్ పైకి ఉసిగొల్పాలని తాపత్రయపడుతున్నారు. హసీనా పాలనలో బంగ్లా, పాక్‌ల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. యూనస్ వచ్చిన తరవాత ఆ పరిస్థితి మారిపోయింది. ఏప్రిల్ 17న ఢాకాలో బంగ్లాపాక్ విదేశాంగ కార్యదర్శుల సమావేశం జరగనుంది. రెండు దేశాల మధ్య తక్కువ ఖర్చుతో విమాన ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడానికి 'ఫ్లై జిన్నా' అనే పాక్ సంస్థకు బంగ్లా ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

**గమనిక**

ఎడిటోరియల్ పేజీకి మీ వ్యాసాలు పంపాలి అనుకుంటే ఈ మెయిల్ ఐడీ
hamsavoiceeditorials@gmail.com
పంపండి. మీ వ్యాసాలు మేము ప్రచురిస్తాం.

# భాష నేర్పని బండ చదువులు

భాష ద్వారానే ఒక తరం నుంచి మరొక తరానికి జ్ఞానం, సంస్కృతీ సంప్రదాయాలు, విలువలు అందుతాయి. ఆధునిక సమాజంలో విద్య వ్యవస్థీకృతం అయినప్పటి నుంచి భాషల మనుగడను 'తరగతి గదుల' ద్వారానే ప్రభుత్వాలు నిర్దేశిస్తున్నాయి. నాటి పరాయి పాలన నుంచి, నేటి ప్రజాస్వామ్య పాలన వరకు పాఠశాలల్లో బోధించే భాషల గురించి ఏదో ఒక రూపంలో చర్చ కొనసాగుతూనే ఉంది.




జాతి సమైక్యతే లక్ష్యంగా 1968, 1986, 2020ల్లో ప్రతిపాదించిన జాతీయ విద్యా విధానాల్లో కేంద్ర ప్రభుత్వాలు త్రిభాషా సూత్రాన్ని రూపొందించాయి. 1968, 1986ల్లోని త్రిభాషా సూత్రం ప్రకారం మొదటి స్థానం మాతృ లేదా స్థానిక భాషది కాగా, రెండోది హిందీ, మూడోది ఇంగ్లిష్. దానికి భిన్నంగా 2020 విధానంలో హిందీని తప్పనిసరి చేయలేదు. తద్వారా భాషల ఎంపికలో రాష్ట్రాలకు, తల్లిదండ్రులకు స్వేచ్ఛనిచ్చారు. మూడింటిలో ఏవైనా రెండు భారతీయ భాషలు, మరొక అంతర్జాతీయ భాష నేర్చుకోవచ్చని నిబంధనలు మార్చారు. మహాత్మా గాంధీ 1919లో దక్షిణ భారత హిందీ మహాసభను మద్రాస్‌లో ఏర్పరచిన తరవాత, తెలుగు ప్రాంతాల్లో హిందీ నేర్చుకోవడం ఉద్యమ స్ఫూర్తితో జరిగింది. మద్రాస్ ప్రెసిడెన్సీలో 1930ల నుంచే హైస్కూళ్లలో హిందీని ఐచ్ఛికంగా బోధించేవారు. 1957 నుంచి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్.ఎస్.ఎల్.సి పబ్లిక్ పరీక్షలలో హిందీని తప్పనిసరి చేయగా, తమిళనాడులో మాత్రం 1968 వరకూ అది ఐచ్ఛికమే! తమిళనాడులో హిందీ వ్యతిరేక ఉద్యమం అనంతరం ద్విభాషా సూత్రాన్ని అమలు చేయడం మొదలు పెట్టారు. దీని ప్రకారం విద్యార్థులు మాతృభాష, ఇంగ్లిష్ మాత్రమే నేర్చుకుంటారు.

**అల్పసంఖ్యాకుల హక్కులు**

ద్విభాషా విధానంలో మొదటి భాషగా తమిళాన్ని తప్పనిసరిగా చదవాలని తమిళనాడు ప్రభుత్వం 2006లో ఉత్తర్వులిచ్చింది. దానిపై వివిధ భాషా సంఘాల ఒత్తిడి మేరకు ఇతర భాషలను ఐచ్ఛికంగా చదువుకోవచ్చని, అందులో ఉత్తీర్ణులు కావాల్సిన అవసరం లేదని చెప్పింది. దానివల్ల భాషా అల్పసంఖ్యాకుల్లో మాతృభాష చదివే విద్యార్థులు గణనీయంగా తగ్గారు. చదివే వారిలోనూ శ్రద్ధగా నేర్చుకోవడం బాగా లోపించింది. అయితే, అల్పసంఖ్యాకులకు వారి మాతృభాషల్లోనూ మిగతా సబ్జెక్టులతో సమానంగా ఉత్తీర్ణతా మార్కులు రావాలని, వాటిని తప్పనిసరిగా మార్కుల లిస్టులో పొందుపరచాలని సుప్రీంకోర్టు తీర్పిచ్చింది. ఒకవేళ తమిళనాడులో త్రిభాషా సూత్రం అమలులో ఉంటే మొదటి భాషగా తమిళం, రెండో భాషగా అల్పసంఖ్యాకులు వారి మాతృభాషను, మూడో భాషగా ఇంగ్లిష్ నేర్చుకునే అవకాశం ఉండేది.

**ప్రమాణాలు ఏవీ?**

త్రిభాషా సూత్రంపై చర్చలు రాజకీయ వ్యూహ ప్రతివ్యూహాలలో చిక్కుకుపోయి, విద్యార్థులకు వివిధ భాషలలో సంభాషణా సామర్థ్యం రావాలన్న లక్ష్యాన్ని మరుగున పరిచాయి. ఆంధ్రప్రదేశ్ హైస్కూళ్లలో హిందీని ఆరు నుంచి పదో తరగతి వరకు 300 గంటలు బోధిస్తున్నారు. శ్వేతజాతీయుడు అమెరికాలో ఉండి ఇంటర్మీడియట్ స్థాయి హిందీ నేర్చుకోవడానికి 450 గంటలు అవసరం. ఆ స్థాయి అంటే దైనందిన జీవితంలో ఉత్తర భారతీయులతో హిందీలో చక్కగా మాట్లాడగలగడం. ఏపీలో 300 గంటలు నేర్పుతున్నా చాలామందికి హిందీ ఎందుకు రావడం లేదు? మరోవైపు మన పాఠశాలల్లో మాతృభాషా మాధ్యమంలో చదువుకునే వారికి రెండో భాషగా ఇంగ్లిష్‌ను 1400 గంటలు (అదే ఆంగ్ల మాధ్యమంలో అయితే 5500 గంటలు పైన) బోధిస్తున్నారు. అయినా చాలా మందిలో కనీస ప్రమాణాలు మృగ్యమవుతున్నాయి. విద్యాహక్కు చట్ట నియమాల ప్రకారం ప్రతి భాషలో ఆయా తరగతుల స్థాయిలో వినడం, మాట్లాడటం, చదవడం, రాయడం అనే నాలుగు నైపుణ్యాలు విద్యార్థులకు రావాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పై లక్ష్యాలకు అనుగుణంగా పాఠ్యపుస్తకాల రూపకల్పన, పాఠ్యాంశాల బోధన, పరీక్షల విధానంలో ఎలాంటి సంస్కరణలు తేలేదు. చివరికి ఉపాధ్యాయుల అర్హత, ఎంపిక పరీక్షలైన టెట్, డీఎస్సీల్లో ఆయా భాషలు బోధించే వారి 'మాట్లాడే నైపుణ్యాల' స్థాయినీ పరీక్షించడం లేదు. విద్యార్థులు వివిధ భాషలు నేర్చుకోవడం వల్ల దేశ సమైక్యత పెంపొందుతుందన్న జాతి నిర్మాతల ఆకాంక్షలను విద్యాశాఖలు విఫలం చేశాయి. పరీక్షల్లో ప్రశ్నాపత్రాల స్థాయి ఆయా తరగతుల ప్రమాణాలకు అనుగుణంగా లేకపోవడం, మాస్ కాపీయింగ్, మూల్యాంకనంలో ఉదారంగా మార్కులు వేయడం వల్ల ఆయా భాషల్లో ప్రమాణాలు మరింతగా దిగజారాయి.

**విధిగా పరీక్షించాలి**

జాతీయ విద్యావిధానం 2020లో తెచ్చిన మార్పులు ఆహ్వానించదగినవే అయినా, భాషల ఉనికిని కాపాడటానికి కేంద్రం కొన్ని నిర్దిష్ట చర్యలు తీసుకోవాలి. పాఠశాలల్లో స్థానిక భాష కాని మాతృభాషల విద్యార్థులు 10 మంది ఉన్నా వారు తమ అమ్మభాషను ఒక సబ్జెక్టుగా చదువుకోవడానికి అవకాశం కల్పించేలా నిబంధనలు పొందుపరచాలి. ఈ భాషల బోధన కోసం ఉపాధ్యాయులను క్లస్టర్ విధానంలో లేదా కాంట్రాక్టు పద్ధతిలో నియమించడానికి అయ్యే ఖర్చును భరించాలి. దీన్ని ప్రైవేట్ స్కూళ్లకూ వర్తింపచేయాలి. సీబీఎస్ఈలో పదో తరగతి బోర్డు పరీక్షల్లోనూ మూడో భాషలో తప్పనిసరిగా ఉత్తీర్ణులవ్వాలన్న నిబంధన తేవాలి. ఐసీఎస్ఈ, ఐబీ కరిక్యులంలలోనూ త్రిభాషా సూత్రం అమలుకు ఆదేశాలివ్వాలి. సీబీఎస్ఈలో 3, 5, 8 తరగతుల్లో నిర్వహిస్తున్న కాంపిటెన్సీ బేస్డ్ పరీక్షల్లో మాతృభాషను తప్పనిసరి చేయాలి. అందులో వినడం, మాట్లాడటం, చదవడం, రాయడం అనే నాలుగు నైపుణ్యాలను విధిగా పరీక్షించాలి. యూకే నిర్వహించే అంతర్జాతీయ ఇంగ్లిష్ ప్రామాణిక పరీక్ష ఐఈఎల్‌టీఎస్ తరహాలో, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో అన్ని భారతీయ భాషలకు వివిధ స్థాయిల్లో ప్రామాణిక పరీక్షలు నిర్వహించాలి. అన్ని డిగ్రీ, పీజీ కోర్సుల్లో స్థానిక లేదా మాతృభాష, ఇంగ్లిష్‌ను సంవత్సరానికి 40 గంటల చొప్పున నేర్చుకునేలా నిబంధనలు మార్చాలి. తద్వారా విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు, భావ వ్యక్తీకరణ మెరుగవుతాయి. వారి ఉజ్జ్వల భవితకు, దేశాభివృద్ధికి అవే దారిదీపాలవుతాయి.

## హిందూ మహాసముద్రంలో బీ2 స్టీల్త్ బాంబర్లు, యుద్ధ నౌకల్ని మోహరించిన అమెరికా

డోనాల్డ్ ట్రంప్ విధిస్తున్న టారిఫ్‌లపై ప్రపంచదేశాలు టెన్షన్‌లో ఉండగా, గుట్టుచప్పుడు కాకుండా అమెరికా మాత్రం తన సైనిక కదలికల్ని మరింత పటిష్టం చేసుకుంటోంది. హిందూ మహాసముద్రం, ఇండోపసిఫిక్ ప్రాంతాల్లో.. బీ2 బాంబర్లను మోహరించింది. అతిపెద్ద సంఖ్యలో బీ2 బాంబర్లను హిందూ మహాసముద్రంలో మోహరించేందుకు పెంటగాన్ ఆదేశాలు జారీ చేసింది. దీంతో డీగో గార్సియా దీవిలో ఉన్న మిలిటరీ బేస్‌కు ఆరు బీ2 బాంబర్ విమానాలను మోహరించారు. ప్లానెట్ ల్యాబ్స్ శాటిలైట్ చిత్రాల ఆధారంగా వాటిని కన్ఫర్మ్ చేశారు. ఇంకా అక్కడ ఉన్న షెల్టర్లు, హ్యాంగర్లలో ఏమైనా బాంబర్లు ఉండి ఉంటాయని అంచనా వేస్తున్నారు.



అమెరికా వద్ద మొత్తం 20 బీ2 స్టీల్త్ బాంబర్లు ఉన్నాయి. అత్యంత అత్యాధునిక మిలిటరీ విమానాల్లో ఆరింటిని ప్రస్తుతం హిందూ మహాసముద్రంలో మోహరించారు. అంటే తమ వద్ద ఉన్న ఫ్లీట్‌లో 30 శాతం అక్కడే ఉన్నట్లు స్పష్టం అవుతోంది. దీంట్లో చాలా వ్యూహాత్మక ఎత్తుగడలు ఉన్నట్లు భావిస్తున్నారు. బీ2 బాంబర్లతో పాటు యుద్ధ విమానాలను మోసుకెళ్లే నౌకలను ఇండోపసిఫిక్ ప్రాంతంలో మోహరిస్తున్నారు. రెండు యుద్ధ నౌకలను హిందూ మహాసముద్రంలోకి, ఒకటి దక్షిణ చైనా సీ వద్దకు తీసుకెళ్తున్నారు.

యూఎస్ఎస్ కార్ల్ విన్‌సన్.. మిడిల్ ఈస్ట్‌కు వెళ్తోంది, ఇక యూఎస్ఎస్ హ్యార్ ఎస్ ట్రూమన్.. ఆరేబియా సముద్రం నుంచి ఆపరేట్ చేస్తుంది. ఇక మూడవ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ యూఎస్ఎస్ నిమిట్జ్..దక్షిణ చైనా సముద్రం దిశగా వెళ్లేందుకు పెంటగాన్ ప్లాన్ చేసింది. అకస్మాత్తుగా యుద్ధ నౌకలను ఎందుకు మోహరిస్తుందన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే హిందూ మహాసముద్ర ప్రాంతంలో రక్షణ వ్యవస్థ బలోపేతం చేసే ఉద్దేశంతో ఈ చర్య చేపట్టినట్లు పెంటగాన్ తెలిపింది.యమెన్‌లోని హౌతీ మిలిటెంట్లను టార్గెట్ చేసే ఉద్దేశంతో బీ2 బాంబర్లను అమెరికా మోహరించినట్లు అనుమానిస్తున్నారు. అయితే ఒక్కొక్క బాంబర్ విమానం సుమారు 40 వేల పౌండ్ల సామర్థ్యం ఉండే పేలోడ్‌ను మోసుకెళ్లగలవు. అయితే యెమెన్ మిలిటెంట్లను తుది ముట్టించేందుకు ఆ బాంబర్లు చాలా ఎక్కువవుతాయని రక్షణ శాఖ నిపుణులు అంచనా వేస్తున్నారు.

## స్టార్టప్‌లపై వ్యాఖ్యలను కాంగ్రెస్ వక్రీకరించింది: పీయూష్ గోయల్

భారత స్టార్టప్ లను ఉద్దేశిస్తూ కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. మన స్టార్టప్‌లు ఐస్‌క్రీమ్‌లు, చిప్స్ తయారీ వద్దే ఆగిపోకుండా చైనా తరహాలో ఏఐ వంటి అంశాలపై దృష్టిసారించాలంటూ ఆయన చేసిన వ్యాఖ్యలను పలువురు తప్పుబట్టారు. తాజాగా ఈ విమర్శలపై ఆయన స్పందించారు. కాంగ్రెస్ పార్టీ నేతలే తన వ్యాఖ్యలను తప్పుగా ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు.




గోయల్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ.. 'స్టార్టప్‌లపై నా సందేశం సానుకూలంగానే ఉంది. కాంగ్రెస్ పార్టీ నేతలే వాటిని తప్పుగా ప్రచారం చేస్తున్నారు. ఇది వారి ప్రతికూల విధానాన్ని ప్రతిబింభిస్తోంది. ఆ పార్టీకి చెందిన సామాజిక మాధ్యమాలు దీనిపై అనవసరంగా వివాదాలు రేకెత్తిస్తున్నాయి. యువ భారతీయులు ఈ స్టార్టప్‌లపై ప్రపంచంతో పోటీ పడేందుకు సిద్ధంగా ఉన్నారు' అని గోయల్ పేర్కొన్నారు.

గురువారం స్టార్టప్ మహాకుంభ్ కార్యక్రమంలో గోయల్ పాల్గొని కీలక వ్యాఖ్యలు చేశారు. మనం ఫుడ్ డెలివరీ యాప్స్‌పై దృష్టిసారించామని.. ఇలాంటి వాటివల్ల దిగువ శ్రేణి కార్మికులు తయారై సంపన్నులు కాలు బయటపెట్టకుండా ఆహారం పొందగలుతున్నారన్నారు. అదే సమయంలో చైనా సంస్థలు ఏఐ, ఈవీలు, సెమీ కండక్టర్ల రంగాలను ఎంచుకుంటున్నాయని తెలిపారు. కొత్త అంకుర సంస్థలు భవిష్యత్‌తరాల కోసం దేశాన్ని సిద్ధం చేయాలని ఈసందర్భంగా పిలుపునిచ్చారు. 'ఐస్‌క్రీమ్‌లు, కిరాణా సరకులు వేగంగా డెలివరీ చేయడం ఆవిష్కరణా?' అని గోయల్ ప్రశ్నించారు.

ఈ వ్యాఖ్యలను జెప్టో సీఈఓ అదిత్ పలిచా, జోహో వ్యవస్థాపకుడు శ్రీధర్ వెంబు, ఇన్ఫోసిస్ మాజీ సీఎఫ్ఓ మోహన్‌దాస్ పాయ్ వంటి ప్రముఖులు తప్పుబట్టారు. ఉద్యోగాల సృష్టి, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించడంలో జెప్టో విజయం సాధించిందని, భారత ఆవిష్కరణల్లో ఇది అద్భుతమని అదిత్ పలిచా పేర్కొన్నారు. ఇంజినీర్‌లు, టెక్నాలజిస్ట్‌లు సవాల్‌గా తీసుకోవాలని, విమర్శగా భావించకూడదని జోహో వెంబు అన్నారు. దేశీయ అంకురాలపై గోయల్ నమ్మకం ఉంచాలని, డీప్‌టెక్ అంకురాలకు తోడ్పాటునివ్వాలని మోహన్‌దాస్ పాయ్ పేర్కొన్నారు. స్టార్టప్‌లలో ఉన్న ఇబ్బందులను పరిష్కరిస్తే, తప్పకుండా విజయం సాధిస్తామని.. చైనాతో భారత అంకురాలను పోల్చకూడదని తెలిపారు.

## నేపాల్‌లో 5 తీవ్రతతో భూకంపం.. వణికిన ఉత్తరభారతం



హిమాలయ దేశం లో భూకంపం సంభవించింది. రిక్టరు స్కేలుపై భూకంపం తీవ్రత 5.0గా నమోదైనట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది. గర్హాకోట్‌కు మూడు కి.మీ దూరంలో, 20కి.మీ లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు పేర్కొంది. శుక్రవారం సాయంత్రం 7.52 గంటల సమయంలో ప్రకంపనలు నమోదైనట్లు వెల్లడించింది.దీని తీవ్రతతో ఉత్తర భారతదేశంలోనూ ప్రకంపనలు నమోదయ్యాయి. ఢిల్లీ, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్‌లోని పలు చోట్ల భూమి కంపించింది. ఈ భూ ప్రకంపనలతో ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. అయితే, ఆస్తి, ప్రాణ నష్టం సంభవించలేదు. అంతకుముందు రోజు అంటే గురువారం మహారాష్ట్ర సోలాపూర్ జిల్లాలో 2.6 తీవ్రతతో భూమి కంపించిన విషయం తెలిసిందే.

## పంట చేలల్లో ఏఐ విప్లవం!

సంప్రదాయ వ్యవసాయానికి ఆధునిక సాంకేతికతను జోడిస్తే ఎలాంటి అద్భుతాలు సృష్టించవచ్చో నిరూపిస్తున్నారు మహారాష్ట్ర రైతులు. చెరకు సాగులో కృత్రిమ మేధ (ఏఐ) ఉపయోగిస్తూ.. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధిస్తున్నారు. మైక్రోసాఫ్ట్, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం కలసి చేసిన ఈ సరికొత్త ప్రయోగం విజయవంతమైంది. దేశంలోనే తొలిసారి ఏఐని ఉపయోగిస్తూ పండించిన చెరకు పంట మరికొద్ది నెలల్లో చేతికి రానుంది! మహారాష్ట్ర బారామతికి చెందిన దాదాపు వెయ్యి మంది రైతులు ఈ అరుదైన ప్రయోగంలో భాగమయ్యారు. సంప్రదాయ సాగు బాటను వీడి, సాంకేతికతను అందిపుచ్చుకున్న వీరంతా 3040 శాతం ఆదాయం అధికంగా అందుకోబోతున్నారు!విస్తీర్ణంపరంగా అత్యధికంగా చెరకు సాగు చేస్తున్న దేశం భారత్. ఉత్పత్తి మాత్రం బ్రెజిల్, చిలీ కంటే చాలా తక్కువ. ఇంకా సంప్రదాయ సాగు విధానాలు అనుసరించడమే ఇందుకు కారణం. సాగులోని అనేక సమస్యలు రైతులకు నష్టాలు మిగల్చడమే కాక, పర్యావరణానికీ హాని కలిగిస్తున్నాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దాలని టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ సంకల్పించింది. వ్యవసాయంలో సుస్థిరత సాధనే లక్ష్యంగా 'ప్రాజెక్ట్ ఫామ్ వైబ్స్' చేపట్టింది. వ్యవసాయంతో ముడిపడిన సమస్త సమాచారాన్నీ సాంకేతికత సాయంతో ముందే గుర్తించి, రైతులకు అందించడమే దీని ముఖ్య ఉద్దేశం. ఏఐ టెక్నాలజీ ఇచ్చే ఆ వివరాలకు అనుగుణంగా సాగు పద్ధతుల్లో మార్పులు చేస్తే లాభాలు ఖాయమన్నది ఆ సంస్థ ఆలోచన. మైక్రోసాఫ్ట్ ప్రాజెక్ట్‌ను భారత్‌కు తీసుకురావడంలో ప్రతాప్‌రావ్ పవార్ కీలకంగా వ్యవహరించారు. ఈయన.. మహారాష్ట్రలోని బారామతి వ్యవసాయాభివృద్ధి ట్రస్టుకు ధర్మకర్త. మైక్రోసాఫ్ట్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ తోడ్పాటుతో 'సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఫామ్ వైబ్స్' ఏర్పాటు చేశారు. ట్రస్ట్ నిర్వహించే కృషి విజ్ఞాన కేంద్రం వేదికగా, బారామతికి చెందిన దాదాపు వెయ్యి మంది రైతులు ఏఐ వ్యవసాయంలో భాగమయ్యారు. ఈ టెక్ సేద్యానికి ఏఐతోపాటు అనేక అధునాతన సాంకేతికతలు మూలాధారం. శాటిలైట్ ఇమేజింగ్, రిమోట్ సెన్సింగ్, గ్రౌండ్ మిల్క్ ఇమేజింగ్, హైపర్‌స్పెక్ట్రల్ ఇమేజ్ టెక్నాలజీ ద్వారా రైతుకు అవసరమైన సమాచారం మొత్తాన్ని యాప్ ద్వారా అందిస్తారు.

## టీజీవి కళాక్షేత్రానికి వన్నె తెచ్చిన పత్తి ఓబులయ్య





### మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్

కర్నూలు , ఏప్రిల్ 5(హంస వాయిస్):రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక అవార్డు పొందిన ప్రతి ఓబులయ్య టీజీవి కళాక్షేత్రానికి వన్నె తీసుకువచ్చారని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు.

ఉగాది పురస్కారాలు సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా కళా రత్న హంస పురస్కారాన్ని పొందిన పత్తి ఓబులయ్యను ఈరోజు టిజివి కళాక్షేత్రంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి ఓబులయ్య ఉపాధ్యాయునిగా జీవితం ఆరంభించినప్పటికీ, కళల పట్ల తనకున్న అభిరుచితో కళా రంగానికి అంకితమయ్యారన్నారు. ఒక కళాకారునిగా టీజీవి కళాక్షేత్రం అధ్యక్ష బాధ్యతలు చేపట్టి కళాక్షేత్రం అభివృద్ధికి కష్టపడుతూనే కళాక్షేత్రాన్ని రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చారని అన్నారు. ఇప్పటికే కళాక్షేత్రానికి 38 రాష్ట్రస్థాయి అవార్డులు రావడం అంటే ఎంత గొప్ప విషయం



అన్నారు. కళాకారులను అందరిని కలుపుకుంటూ కళాక్షేత్ర అభివృద్ధితోపాటు పేద కళాకారులను ఆదుకోవడం లోను ఆయన కృషి ఎంతో ఉందన్నారు. కుల మతాలకు అతీతంగా కలలను ప్రోత్సహించడమే లక్ష్యంగా కళాక్షేత్రాన్ని తీర్చిదిద్దామని టీజీ వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి, విద్యావ్యక్త పుల్లయ్య, hcu ప్రొఫెసర్ రాముడు,
చింతా సురేష్, ఆర్జా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## రోగులకు గుండె ఆపరేషన్లు చేసిన నకిలీ డాక్టర్.. ఏడుగురు మృతి

భోపాల్: ఒక నకిలీ డాక్టర్ పలువురు రోగులకు గుండె ఆపరేషన్లు చేశాడు. అయితే ఒకే నెలలో ఏడుగురు మరణించారు. దీంతో ఆ డాక్టర్‌పై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో దర్యాప్తు జరుపగా అతడు నకిలీ డాక్టర్ అని తేలింది. మధ్యప్రదేశ్‌లోని దామోహ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఎన్ జాన్ కెమ్ అనే వ్యక్తి ప్రముఖ కార్డియాలజిస్ట్‌గా చెప్పుకున్నాడు. అదే పేరున్న ప్రసిద్ధ బ్రిటిష్ వైద్యుడిగా ధృవీకరణ పత్రాలు సృష్టించాడు. దామోహ్‌లోని క్రిస్టియన్ మిషనరీ ఆసుపత్రిలో డాక్టర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో పలువురు రోగులకు హార్ట్ సర్జరీలు చేశాడు. కాగా, గుండె ఆపరేషన్లు చేయించుకున్న రోగుల్లో ఒకే నెలలో ఏడుగురు వ్యక్తులు మరణించినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆ డాక్టర్‌పై అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో న్యాయవాది, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ జిల్లా అధ్యక్షుడు దీపక్ తివారీ ఆ డాక్టర్‌పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. సర్జరీ తర్వాత మరణించిన రోగుల మరణాల సంఖ్య మరింత ఎక్కువగా ఉండవచ్చని ఆందోళన వ్యక్తం చేశాడు. మరోవైపు జిల్లా కలెక్టర్ ఆదేశంతో దర్యాప్తు బృందం ఆ క్రిస్టియన్ మిషనరీ ఆసుపత్రిని సందర్శించింది. అక్కడున్న అన్ని పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రముఖ బ్రిటీష్ వైద్యుడు ఎన్ జాన్ కెమ్ పేరుతో అతడు నకిలీ పత్రాలు సమర్పించినట్లు తెలుసుకున్నారు.కాగా, నకిలీ డాక్టర్ అసలు పేరు నరేంద్ర విక్రమాదిత్య యాదవ్ అని దర్యాప్తులో తేలింది. హైదరాబాద్‌లో క్రిమినల్ కేసు నమోదుతో సహా పలు వివాదాల్లో అతడి ప్రమేయం ఉన్నట్లు తెలిసింది. దీంతో ఆ నకిలీ డాక్టర్‌తోపాటు రోగుల మరణాలపై మరింతగా దర్యాప్తు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.

## ఆ బాలిక చదువు బాధ్యతలు తీసుకుంటా



ఉత్తర్‌ప్రదేశ్‌లోని అంబేడ్కర్‌నగర్‌లో ఇటీవల అక్రమ గుడిసెలను తొలగిస్తున్నప్పుడు ఎనిమిదేళ్ల విద్యార్థిని తన పుస్తకాలను తీసుకెళ్తున్న వీడియో వైరల్ కాగా.. సదరు బాలిక విద్యా ఖర్చులను తాను భరిస్తానని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ హామీ ఇచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. యూపీలోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. "జ్ఞానానికి, తెలివికి బుల్డోజర్ చర్య చిహ్నం కాదు. అది విధ్వంసానికి పరాకాష్ఠ. వారు (భాజపా పాలకులు) పేదల గుడిసెలను కూల్చి విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టారు. ఆ పిల్లల చదువు బాధ్యతలను మేం తీసుకుంటాం" అని పేర్కొన్నారు. కాగా.. అంబేడ్కర్‌నగర్‌లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి కొందరు గుడిసెలు వేసుకున్నారంటూ అధికారులు ఇటీవల అక్కడ కూల్చివేతలు చేపట్టారు. ఆ సమయంలో అనన్య యాదవ్ అనే ఎనిమిదేళ్ల బాలిక.. కూలగొడుతున్న గుడిసె నుంచి తన పుస్తకాలను తీసుకుని పరిగెడుతున్న వీడియో వివిధ మాధ్యమాల్లో వైరల్ అయింది. అధికారుల చర్యలను పలువురు ఖండించారు. సుప్రీంకోర్టు దృష్టికి సైతం ఈ వీడియో వెళ్లింది.

## కేరళ సీఎం విజయన్‌కు షాక్



కేరళలో అధికార పక్షం లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్)కు ఎదురుదెబ్బ తగిలింది. అక్రమ చెల్లింపుల కుంభకోణంలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ కుమార్తె టి.వీణను విచారించేందుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) అక్రమ లావాదేవీల్లో ఆమె ప్రమేయం ఉన్నట్లుగా ఆరోపణలు రావడంతో కంపెనీల చట్టం ఉల్లంఘన కింద అభియోగాలు నమోదయ్యాయి. కార్పొరేట్ మోసాలను దర్యాప్తు చేసే భారత ప్రభుత్వ సంస్థ 'తీవ్ర మోసాల దర్యాప్తు కార్యాలయం' (సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్/ఎస్ఎఫ్ఐవో) కొచ్చిన్‌లోని ప్రత్యేక న్యాయస్థానంలో ఛార్జిషీటు సమర్పించిన నేపథ్యంలో ఈ అనుమతి లభించింది. ఇది రాజకీయ ప్రేరేపిత చర్యగా సీపీఎం పొలిట్‌బ్యూరో కోఆర్డినేటరు ప్రకాశ్ కారాట్, కేరళకు చెందిన సీపీఎం నేతలు శుక్రవారం ఖండించారు. చట్టపరంగా, రాజకీయంగా దీనిని ఎదుర్కొంటామంటూ తమిళనాడులోని మదురైలో జరుగుతున్న సీపీఎం మహాసభల్లో ఈ మేరకు పార్టీ ఓ తీర్మానం కూడా చేసింది. సీఎం విజయన్ రాజీనామా చేయాలన్న డిమాండును కాంగ్రెస్, భాజపా నాయకులు పునరుద్ఘాటించారు.

**రూ.2.70 కోట్ల అక్రమ లబ్ధి పొందారని..**

కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ నుంచి టి.వీణ నిర్వహిస్తున్న ఐటీ కంపెనీ 'ఎక్స్‌లాజిక్ సొల్యూషన్స్'కు రూ.2.70 కోట్ల చెల్లింపులు జరిగాయి. దీనికి బదులుగా ఎలాంటి ఐటీ సేవలు అందించలేదన్నది ఆరోపణ.

## కొనసాగుతున్న అనంత్ పాదయాత్ర

రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ చిన్నకుమారుడైన అనంత్ అంబానీ (29) గుజరాత్‌లోని తమ పూర్వీకుల స్వస్థలం జామ్‌నగర్ నుంచి శ్రీకృష్ణుడు వెలసిన దివ్యక్షేత్రమైన ద్వారకకు చేపట్టిన పాదయాత్ర కొనసాగుతోంది. 170 కిలోమీటర్ల ఈ పాదయాత్రను మార్చి 29న ప్రారంభించిన అనంత్ రోజుకు 20 కి.మీ.ల చొప్పున నడుస్తున్నారు. నిత్యం రాత్రివేళ ఏడు గంటల చొప్పున నడుస్తూ మార్గ మధ్యంలో ఎదురయ్యే ప్రజలతో మమేకం అవుతున్నారు. తన 30వ పుట్టినరోజుకు రెండు రోజులు ముందుగా ఏప్రిల్ 8న ఆయన ద్వారకకు చేరుకుంటారు. ఈ యాత్రలో కొందరు స్థానికులు సైతం అనంత్‌కు సంఘీభావంగా వెంట నడుస్తున్నారు. మరికొందరు ఆయనకు ఎదురుగా వచ్చి ఫొటోలు తీసుకొంటున్నారు. హనుమాన్ చాలీసా, సుందరకాండ, దేవీ స్తోత్రాలను వల్లె వేస్తూ ఈ ఆధ్యాత్మిక పాదయాత్రలో అనంత్ ముందుకు సాగుతున్నారు.






# బాబు జగ్జీవన్ రామ్ ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి

- మాజీ రాష్ట్ర ఉపముఖ్యమంత్రివర్యులు ఎస్.బి.అంజద్ భాష, జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి, నగర మేయర్ కే.సురేష్ బాబు

**కడప, ఏప్రిల్ 5 ( హంస వాయిస్) :**





వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు ఆధ్వర్యంలో బాబు జగజ్జీవన్ రావు 118 వ జయంతి వేడుకలలో ముఖ్య అతిథులుగా మాజీ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు ఎస్.బి.అంజద్ భాష, జిల్లా అధ్యక్షులు పి రవీంద్రనాథ్ రెడ్డి, నగర మేయర్ కే.సురేష్ బాబు, ప్రతి ఒక్కరూ బాబు జగ్జీవన్ రామ్ ను ఆదర్శంగా తీసుకొవాలని సంయుక్తంగా పేర్కొన్నారు.స్థానిక కొత్త కలెక్టరేట్ సమీపంలోని బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి సందర్భంగా మాజీ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు ఎస్.బి.అంజద్ భాష, నగర మేయర్ కే.సురేష్ బాబు జిల్లా అధ్యక్షులు పి రవీంద్రనాథ్ రెడ్డి జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాజీ రాష్ట్ర ఉపముఖ్య మంత్రివర్యులు ఎస్ బి అంజద్ భాష మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ 118 జయంతి ఉత్సవాలను ఎంతో ఘనంగా దేశవ్యాప్తంగా నిర్వహించుకోవడం జరుగుతోందన్నారు. అందులో భాగంగా కడప నగరంలో కూడా ప్రతిఒక్కరు బాబు జగ్జీవన్ రామ్ కు ఘన నివాళులు అర్పించడం జరిగిందని అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ మహోన్నత వ్యక్తి అని ఆయనను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. కులాలకు, మతాలకు అతీతంగా, పార్టీలకు అతీతంగా కూడా ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని చెప్పారు. బాబు జగ్జీవన్ రామ్ ఒక సామాన్యమైన పేద కుటుంబంలో జన్మించి దేశానికే ఉప ప్రధానిగా పనిచేసిన వ్యక్తి అని అన్నారు. అదేవిధంగా కార్మిక, వ్యవసాయ శాఖ మంత్రిగా అనేక సంస్కరణలు తీసుకొని వచ్చి దేశానికే ఆదర్శంగా నిలవడం జరిగిందని అన్నారు. అలాంటి మహోన్నతమైన వ్యక్తి యొక్క జయంతి ఉత్సవాలు దేశవ్యాప్తంగానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా కూడా ఎక్కడైతే భారతీయులు ఉన్నారో వారందరూ కూడా ఎంతో ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతోందని అన్నారు. రాబోవు రోజుల్లో కూడా ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన రైతుల కోసం అయితే నేమి, కార్మికుల కోసమైతేనేమి ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చారని, ఆ సంస్కరణలను ప్రజలకు చేరువ చేసేందుకు ప్రతి ఒక్కరూ సాయి శక్తుల కృషి చేయాలని ఈ సందర్భంగా తెలియజేస్తున్నానని చెప్పారు. మరోసారి ఆయనకు ఘన నివాళులు అర్పిస్తూ ఆయన ఆశయ సాధన కోసం ఈ ప్రభుత్వం పని చేస్తుందని ఈ సందర్భంగా తెలియజేస్తూ, ఇవాళ ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కూడా మనస్ఫూర్తిగా అభినందనలను తెలియజేస్తున్నానని చెప్పారు.అనంతరం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ గారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు నడిపించడం జరిగింది, మరియు డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు,కోఆప్షన్ సభ్యులు, జిల్లా నగర అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, సంఘాల నాయకులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# పేదల పెన్నిధి జగ్జీవన్ రామ్



- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి.

**కడప, ఏప్రిల్ 5 ( హంస వాయిస్ ):**

పేదల పెన్నిధి జగజీవన్ రామ్ అని డిసిసి అధ్యక్షురాలు డిఎన్ విజయ్ జ్యోతి పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1908 ఏప్రిల్ 5వ తేదీన బీహారులో బాబు జగ్జీవన్ రామ్ జన్మించారు. కేంద్ర కార్మిక శాఖ మంత్రి, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి, రక్షణ శాఖమంత్రి, ఉప ప్రధానమంత్రిగా వ్యవహరించారు. ఆయనకు భారత రత్న ఇవ్వాలని విజయ జ్యోతి కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, మామిళ్ళ బాబు, షేక్ నీలం, ముబారక్ భాషా, రఫిక్ ఖాన్, కమల్ భాష, సంజయ్ కాంత, సిరాజుద్దీన్, శ్యామలమ్మ, మల్లెం విజయ్ భాస్కర్, శీలం గంగయ్య, వెంకటరమణారెడ్డి, అలెక్స్ సురేష్, సయ్యద్ గౌస్ పీర్, హమీద్, పాలెం హరిప్రసాద్, కదిరి ప్రసాద్ గౌడ్, ఆసిఫ్ ఖాన్, లక్ష్మీకాంత, గద్దె సునీత, శ్రీనివాసరెడ్డి, జహ్హూర్, దినకర్ రెడ్డి, నాసిర్ ఖాన్, సిద్ధి క్ పాల్గొన్నారు.

# మౌలానా జాకీర్ హుస్సేన్ అరెస్ట్ ఖండిస్తున్నాం

- 'వక్ఫ్ సవరణ చట్టం, 2024'ను వెనక్కి తీసుకోవాలి
- అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు.
- అఖిలపక్ష ప్రజాసంఘాల డిమాండ్.

**కడప ఏప్రిల్ 5 ( హంస వాయిస్) :**

వక్ఫ్ సవరణ చట్టం, 2024'ను వెనక్కి తీసుకోవాలని మౌలానా జాకీర్ హుస్సేన్ అక్రమ అరెస్టులను ఖండిస్తూ శనివారం కడప ప్రెస్ క్లబ్ లో అఖిలపక్ష ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేయటం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్ రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శిల రవిశంకర్ రెడ్డి సిపిఐ జిల్లా కార్యదర్శి చంద్ర జేఏసీ కన్వీనర్ అహ్మద్ బాబు బాయ్ ఎస్ డి పి ఐ రాష్ట్ర కార్యదర్శి తాహిర్ లు మాట్లాడుతూ, అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఎంత ఎత్తున అణిచివేత ప్రారంభిస్తే అంతకు రెండింతలు ఉద్యమాలు పెరుగుతాయని వారన్నారు. వక్ఫ్ సవరణ చట్టం'ను పార్లమెంటు ఆమోదించడాన్ని అఖిలపక్ష ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. మతాల మధ్య విభజన పెంచి, దేశ లౌకిక స్వభావాన్ని, మత సామరస్యాన్ని దెబ్బతీసే ఈ చట్టానికి వ్యతిరేకంగా మత గురువు మౌలానా జాకీర్ హుస్సేన్ మాట్లాడితే ఒక టెర్రరిస్టు వలె ఆగం మేఘాలపై అరెస్టు చేయడం వెనుక టిడిపి బిజెపి హస్తముందని వారన్నారు ఇలాంటి అరెస్టులకు ఎవరూ భయపడరని సోషల్ మీడియా వేదికగా బిజెపి ఇష్టాచారంగా ముస్లింలను కీచపరిచే విధంగా మాట్లాడుతుంది వారిపై ఈ పోలీసులకు ధైర్యం ఉంటే కేసులు పెట్టగలరా అని వారన్నారు ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మత గురువు మౌలానా జాకీర్ హుస్సేన్ పై పెట్టిన కేసులను వెనక్కి తీసుకోవాలని వారన్నారు
1995 వక్ఫ్ చట్టం వక్ఫ్ ఆస్తులను రక్షించి, మతపరమైన, ధార్మిక ప్రయోజనాల కోసం వినియోగించడాన్ని, సరైన పద్ధతిలో నిర్వహించడానికి చట్టపరంగా నియంత్రించే మార్గదర్శకాలను అందించింది, వాటి దుర్వినియోగం, అనధికార విక్రయాలను, దురాక్రమణలను నిరోధించింది సవరించిన చట్టంలో గణనీయమైన మార్పులను చేశారు. ఇది మునుపటి చట్టంలో నిర్దేశించిన పునాది సూత్రాలను దెబ్బతీస్తుంది. ఈ సవరణ ద్వారా బిజెపి ప్రభుత్వం ప్రజలను మత ప్రాతిపదికన విభజించడమే లక్ష్యంగా తన హిందుత్వ ఎజెండాను ముందుకు తెస్తోంది. ముస్లింలు విస్తృతంగా భూకబ్జా చేసేందుకు వక్ఫ్ చట్టాన్ని ఉపయోగించారని పదే పదే తప్పుడు ప్రచారం చేస్తోంది. ముస్లిమేతరులకు వక్ఫ్ ఆస్తుల నిర్వాహణలో స్థానం కల్పించేలా చట్టంలో సవరణలు చేశారు. ముస్లింలు తమ మతాన్ని ఆచరించడానికి రాజ్యాంగం కల్పించిన హక్కులపై దాడి అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టం, 2024'ను వెనక్కి తీసుకోవాలని లేనిపక్షంలో కలిసొచ్చే లౌకిక ప్రజాస్వామ్య వాదులతో కలిసి ఉద్యమాలను అద్భుతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మక్బూల్ భాష సంఘ సేవకులు సలావుద్దీన్ ఎంఆర్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు దస్తగిరి కాంగ్రెస్ పార్టీ నాయకులు న్యాయవాది మహమ్మద్ అలీ ఖాన్ హమీద్ వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# పీస్ స్కూల్ విద్యార్థులు అద్భుతమైన ప్రయోగాలు చేయడం ప్రశంసనీయం



- స్కూల్ చైర్మన్ సయ్యద్ గౌస్ పీర్

**కడప, ఏప్రిల్ 5 (హంస వాయిస్):**

కడప నగరంలోని మరియాపురం లో ఉన్న పీస్ ఇస్లామిక్ ఇంటర్నేషనల్ హై స్కూల్ చైర్మన్ సయ్యద్ గౌస్ పీర్ ఆధ్వర్యంలో లో సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్ననాటి నుండే విద్యార్థులు సైన్స్ ఫెయిర్ లో పాల్గొని తమ మేధో శక్తిని పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు అబ్బురపరిచే విధంగా తమ ప్రతిభతో ఉత్తమ ప్రయోగాలు చేయడం ప్రశంసనీయమన్నారు. సైన్స్ ఫెయిర్ లో ప్రతిభ చూపించిన విద్యార్థులను స్కూల్ చైర్మన్ సయ్యద్ గౌస్ పీర్ అభినందిస్తూ ప్రశంసించారు. అలాగే ప్రముఖులు వేంపల్లె షబ్బీర్, ఆప్ కి ఆవాజ్ మక్బూల్, సైన్స్ ఫెయిర్ లోని ప్రాజెక్టులను తిలకించి అద్భుతంగా చేసిన విద్యార్థులను, స్కూల్ చైర్మన్ సయ్యద్ గౌస్ పీర్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్కూల్ స్టాఫ్, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుడికి అంత్యక్రియలు

- అనాధకు అంత్యక్రియలు నిర్వహించడం మానవత ధర్మం
- మానవత్వం చాటుకున్న అభి ట్రస్ట్..

**కడప, ఏప్రిల్ 5 ( హంస వాయిస్) :**



అనాధలను ఆదరిస్తున్న ఎద్దుల పెద్ద శేషమ్మ ఆశ్రమ నిర్వాహకుడు ఎద్దుల నాగేంద్ర, ఆ ఆశ్రమంలో అనాధలకు ఎటువంటి ఆపద వచ్చిన ముందుకు వస్తున్న అభి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎన్ విజయబాబు, వివరాల్లోకెళ్తే తిప్పలూరు గ్రామం ఎద్దుల పెద్ద శేషమ్మ వృద్ధాశ్రమంలో ఆశ్రయించిన అనాధ వృద్ధుడు అనారోగ్యం కారణంగా శనివారం మృతి చెందాడు, ఎవరూ లేని అనాధలకు మేమున్నామంటూ ఆదరించడం వారికి సాధ్యమైంది అనవచ్చు, ఆ అనాధ వృద్ధుడికి అన్నం పెట్టి అన్ని సౌకర్యాలు ఏర్పాటుచేసి ఆ వృద్ధుడిని ఎంతగానో చక్కగా చూసుకుంటూన్నా సమయంలో ఆయన మృతి చెందడం బాధాకరం, ఆశ్రమ నిర్వాహకుడు నాగేంద్ర వెంటనే అభి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎన్ విజయబాబు కు తెలపడంతో వెంటనే అభి ట్రస్ట్ సభ్యులతో కలిసి ఆశ్రమ నిర్వాహకుడు నాగేంద్ర, అభి ట్రస్ట్ చైర్మన్ విజయబాబులు సంప్రదాయబద్ధంగా పాడె మోసి అంత్యక్రియలు నిర్వహించారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరూ లేని వారు అనాధగా చనిపోవద్దని మేమున్నామని చెప్పే సంకల్పంతోనే ట్రస్ట్ ద్వారా అంత్యక్రియలు చేయడం జరుగుతుందన్నారు, కరోనా మహమ్మారి వలన ప్రపంచం తలకిందులైన సమయంలో కూడా కుటుంబ సభ్యులుగా అంత్యక్రియలు నిర్వహించడం జరిగింది అది మేం మర్చిపోలేము అని తెలియపరిచారు, అన్నదానం చేయడం తో పుణ్యకార్యం అలాగే అంత్యక్రియలు నిర్వహించడం మహా పుణ్యకార్యం మానవతా ధర్మంలో భాగమని అన్నారు, వృద్ధిడి ని చివరి వరకు ఆదరించి ఆశ్రమ నిర్వాహకుడు చూసుకోవడం, మృతిచెందిన ఆ వృద్ధుడికి మేమే మీ కుటుంబ సభ్యులు అంటూ అభి ట్రస్ట్ ద్వారా అంత్యక్రియలు నిర్వహించడం స్థానికుల ద్వారా అభినందనలు పొందారు, మనిషికి మనిషే సహాయపడాలని ఒక గొప్ప సంకల్పంతో ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని సేవ చేయడంలో ముందుకు రావాలని అందరూ మానవత్వం చాటాలని కోరారు..

# రాయలసీమ ప్రాంత రచయితకు ఉగాది పురస్కా.ర అవార్డులు రావడం అభినందనీయం.



- ఆప్ కి ఆవాజ్ ఆధ్వర్యంలో వేంపల్లి షరీఫ్ కి సత్కారం
- ఆప్ కి అవాజ్ రాష్ట్ర కార్యదర్శి మక్బూల్ భాష.

**కడప , ఏప్రిల్ 5 ( హంస వాయిస్) :**

కళల కాణాచి కడప జిల్లా అని జిల్లాకు చెందిన రచయిత వేంపల్లి షరీఫ్ కి ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతులమీదుగా ఉగాది పురస్కారం దక్కడం అభినందనీయమని ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మక్బూల్ భాష అన్నారు. శనివారం ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యాలయంలో రచయిత వేంపల్లి షరీఫ్ కు ఆప్ కి అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో సత్కారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆప్ కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మక్బూల్ బాషా మాట్లాడుతూ ఇప్పటికే కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కారంతోపాటుగా రాష్ట్ర స్థాయిలో కూడా అనేక పురస్కారాలు అందుకుని తనదైన శైలిలో పేదల జీవితాలను కథలుగా మలుస్తున్న వేంపల్లి షరీఫ్ తన రచన వ్యాసంగంలో మరింత ముందుకు వెళ్లి కడప జిల్లాకే కాకుండా మొత్తం రాయలసీమకు, అలాగే రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆశించారు. రచయిత వేంపల్లి షరీఫ్ మాట్లాడుతూ ఇలాంటి చిరు సత్కారాలు తనకు ఎంతో ఉత్సాహాన్ని నింపుతాయని ఈ ప్రోత్సాహంతో మరిన్ని రచనలు చేస్తానని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్ కి ఆవాజ్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ షాజహాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ చాన్ బాషా , జిల్లా కమిటీ సభ్యులు అబిద్ హుస్సేన్ , షేక్ షా వలి తదితరులు పాల్గొన్నారు.

# పేద బడుగు బలహీన వర్గాల మహనీయుడు బాబు జగజ్జీవన్ రామ్ 118 వేడుకలు

**కడప , ఏప్రిల్ 5 (హంస వాయిస్) :**



పేద బడుగు బలహీన వర్గాల సేవలందించిన మహనీయుడు భారతదేశం మాజీ ఉప ప్రధానమంత్రిగా పేద ప్రజల కోసం సేవలందించిన మహానాయకున డాక్టర్ బాబు జగజ్జీవన్ రావ్ 118 వ జయంతి సందర్భంగా కడప నగరంలోని ఆయన విగ్రహానికి పూలమాలవేసిన ఆంధ్రప్రదేశ్ దళిత మిత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కైపు రామాంజనేయులు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కైపు బాబు ఆంధ్రప్రదేశ్ దళిత మిత్ర సంఘం జిల్లా కన్వీనర్ ఆర్ సుబ్బరాయుడు కో కన్వీనర్ సి బాబు లక్కీ ప్రసాద్ తదితరులు పాల్గొని ఘన నివాళులర్పించడం జరిగింది.

# డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి సందర్భంగా నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఘన నివాళులు

**కడప , ఏప్రిల్ 5 (హంస వాయిస్):**



భారత స్వాతంత్ర పోరాటంలో తమదైన పాత్ర పోషించి సమాజ సమానత్వనికై పాటుపడిన మహా మనిషి బాబు జగ్జీవన్ రామ్ సంఘ సంస్కర్త గా, తన పరిపోలన దక్షతతో అఖండ భారతావనికి విశేష సేవలందించిన మహోన్నత మనిషి భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ కడప నగరం లోని మహావీర్ సర్కిల్ నందు భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్బంగా నగర కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు అఫ్జల్ ఖాన్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో నగర ఉపాధ్యక్షులు హమీద్, డివిజన్ నాయకులు కమాల్, జాహూర్, బాబ్జి, దినకర్ రెడ్డి,జమీల్, మహిళా నాయకురాలులు శ్యామలదేవి,సంధ్య, గౌరవ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాబు జగజ్జీవన్ రామ్ కు ఘన నివాళి..

**కాకినాడ, ఏప్రిల్ 5**
**(హంస వాయిస్ ప్రతినిధి)**



భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగజ్జీవన్ రామ్ గొప్ప సంఘసంస్కర్త అని కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ కొనియాడారు. జగజ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏ ఆర్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, ఏ ఆర్ డీఎస్పీ శ్రీహరి రావు, జిల్లా కార్యాలయ వివిధ విభాగాలు ఇన్స్పెక్టర్లు, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మక్కిన వారి గూడెంలో డాక్టర్ బాబు జగజీవన్ రామ్ 118 వ వేడుకలు..

- ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ రాష్ట్ర నేత విస్సంపల్లి సిద్దు మాదిగ..

**టీ నర్సాపురం, ఏప్రిల్ 5 (హంస వాయిస్ ప్రతినిధి)**

:




టీ నర్సాపురం మండలం మక్కినవారిగూడెంలో డాక్టర్ బాబు జగజీవన్ రామ్ 118 వ జన్మదిన వేడుకలు ఎమ్మార్పీఎస్, ఎం ఎస్ పి మండల నాయకులు తడకమళ్ళ ఆనందరావు మాదిగ మరియ దిరిసినపు విజయ మాదిగ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్,ఎం ఎస్ పి రాష్ట్ర నాయకులు, పోలవరం నియోజకవర్గ పరిశీలకులు విస్సంపల్లి సిద్ధూ మాదిగ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కటింగ్ చేసి మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా సిద్ధూ మాదిగ మాట్లాడుతూ డాక్టర్ బాబు జగజీవన్ రావ్ స్వతంత్ర సమర యోధులు ఈ దేశానికి ఎన్నో సేవలు అందించిన మహానుభావుడు అని కొనియాడారు. మూడు దశాబ్దాల పాటు కేంద్ర మంత్రివర్గంలో పదవులు అలంకరించిన వ్యక్తి అన్నారు. అంటరానితనాన్ని అనుభవించి అంటరానితనం నిర్మూలనకు కృషి చేసిన వ్యక్తి ఈ దేశ ఉప ప్రధానిగా పనిచేశారని పేర్కొంటూ కేంద్రమంత్రిగా పని చేశారన్నారు. 30 సంవత్సరాల వయసులోనే ఎన్నో పేరు ప్రఖ్యాతలు సంపాదించిన వ్యక్తిగా పేరు గడించాడని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్, విద్యార్థులు యువకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సంఘుసంస్కర్తగా సంఘాల అభివృద్ధికి
# జగజ్జీవన్ రామ్ కృషి..





- జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి..
- జగజ్జీవన్ రామ్ కు ఘన నివాళి..
- జాంపేట చర్చి సెంటర్లో బాబు జగజ్జీవన్ రామ్ 117వ జయంతి వేడుకలు..

**రాజమహేంద్రవరం, ఏప్రిల్ 5**

**(హంస వాయిస్ ప్రతినిధి) :**

రాజకీయ నాయకుడుగా, స్వాతంత్ర్య సమరయోధుడు గా , మంత్రిగా కాకుండా ఒక సంఘ సంస్కర్త గా సంఘాల అభివృద్ధికి బాబు జగజ్జీవన్ రామ్ ఎంతో కృషి చేశారని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. స్థానిక జామ్ పేట చర్చి సెంటర్ లో ఉన్న బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహం వద్ద ఆయన 117 వ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు, ఎస్పీ నరసింహా కిషోర్, జెసి చిన్న రాముడు, సంఘాల ప్రతినిధులతో కలిసి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ, సమాజ శ్రేయస్సు ఆకాంక్షించే వ్యక్తిగా బాబు జగజ్జీవన్ రామ్ చేసిన కృషిని కొనసాగిస్తూ, మరికొందరికి ఆదర్శంగా నిలవాలని పిలుపు ఇచ్చారు. సంఘం కోసం ఆలోచించండి, సామాజిక న్యాయం జరగాలన్న ఆయన ఆశయాలను పుణికి పుచ్చుకోవాల్సి ఉందన్నారు. సమాజంలో అసమానతలు ఉండరాదు, రాజ్యాంగం కల్పించిన హక్కుల్ని ఖచ్చితంగా పాటించాలని కోరారు. వారి ఆశయాల స్ఫూర్తి నీ అందరిలో నింపడానికి జగజ్జీవన్ రామ్ వంటి మహనీయుల జన్మ దిన వేడుకలు జరుపుకోవడం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. మన చుట్టూ ఉన్న వారి అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ కోరారు. సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభివృద్ధి , సామాజిక అసమానతలు అధిగమించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. దేశ నిర్మాణ క్రమంలో, సంఘాల ఔనిత్యానికి తగిన గుర్తింపు ఇవ్వడం లో జగజ్జీవన్ రామ్ చేసిన కృషి నిరుపమాన మన్నారు. అట్టడగు వర్గాల అభ్యున్నతి కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. ఈ సందర్భంగా దళితులు అందరూ ఐక్యత గా ఉండాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు పిలుపు ఇచ్చారు. సమాజంలో ఉన్న సామాజిక అసమానతలను తొలిగే వరకు కలిసి కట్టుగా ఉండి రాజ్యాంగం కల్పించిన హక్కుల్ని ఖచ్చితంగా పాటించాలని కోరారు. బాబు జగజ్జీవన్ రామ్ వంటి స్ఫూర్తి ఇచ్చే నాయకులని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. మీ పక్షాన నిలబడతానిని, ఏ అవసరం వొచ్చినా అందుబాటులో ఉంటానని తెలిపారు. జాతీయ ఔనిత్యాన్నీ కాపాడే బాధ్యత మనపై ఉందన్నారు. క్వారీ మార్కెట్ లో 10 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం సొంత నిధులతో చేపట్టినట్లు చెప్పారు. ఈరోజు బాబు జగజ్జీవన్ విగ్రహాన్నీ, స్మారక భవనాన్నీ ప్రారంభించినట్లు తెలిపారు.

జిల్లాఎస్పీ డి నరసింహా కిషోర్ మాట్లాడుతూ ఎంతో కష్ట పడితే మనకు స్వతంత్రం వచ్చింది, దానిని కాపాడుకోవడం మన చేతుల్లో ఉంది. జగజ్జీవన్ వంటి నాయకుల అడుగులో అడుగులు వేస్తూ, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. వారి జన్మదినాన్ని ఒక పండుగలా జరుపుకోవడం వారి ఆశయాల స్ఫూర్తి కలిగిస్తోందని అన్నారు. రాజ్యాంగ విలువలు కాపాడుకుంటూ ఒక గొప్ప భారత దేశ నిర్మాణంలో భాగస్వామ్యం అయినపుడు వారికి ఘనమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో ఎస్పీ డి నరసింహా కిషోర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు, శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడిపూడి సత్తి బాబు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎమ్ ఎస్ శోభారాణి, ఆర్ ఎమ్ సి సిటీ ప్లానర్ జి. కోటయ్య , స్థానిక కుల సంఘాల ప్రతినిధులు వెంట్రాపాటి వీర్రాజు, రెడ్డి మానేశ్వర రావు, తాళ్లూరి బాబు రాజేంద్ర ప్రసాద్, కోరుకొండ చిరంజీవి, దొండపాటి క్రిష్టాఫర్ , పెద్ద ఎత్తున ప్రజలు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పేదలకు చీరలను పంపిణి చేశారు.

# శ్రీ మద్ది స్వామి ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకం..



**(హంస వాయిస్ ప్రతినిధి)**

**జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 5**

ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం గురువాయిగూడెం గ్రామంలో తెల్ల మద్ది చెట్టు తొర్రలో స్వయంభువులై వెలిసిన శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయం వద్ద స్వామివారి ఉత్సవమూర్తికి అర్చక స్వాములు శాస్త్రవేత్తంగా పంచామృతాభిషేకం వైభవంగా నిర్వహించారు.ప్రతి శనివారం నిర్వహించు అభిషేక సేవ సందర్భంగా ఆలయ ముఖమండపం పై స్వామివారి ఉత్సవమూర్తికి అర్చక స్వాములు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి పంచామృత అభిషేకాన్ని తిలకించారు. ఆలయ సిబ్బంది భక్తులకు ప్రసాదాలు అందజేశారు. స్వామివారి నిత్యాన్నదాన సత్రంలో అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. స్వామివారిని తణుకు నాలుగవ అదనపు జిల్లా జడ్జి శ్రీమతి డి. సత్యవతి, జాయింట్ చీఫ్ ఎలెక్టోరల్ ఆఫీసర్ మరియు జాయింట్ సెక్రటరీ ఆదూరి వెంకటేశ్వరావు సతీసమేతంగా విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అర్చకులు, కార్యనిర్వహణాధికారిణి ఆర్ వి చందన, వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజా ఏర్పాట్లు చేశారు. అనంతరం ముఖమండపం పై అర్చకులు వారికి వేదాశీర్వచనం చేసి, స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి చిత్రపటం అందజేశారు. శ్రీస్వామివారి దర్శనానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి అసౌకర్యము కలగకుండా ఆలయ పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారిణి ఆర్.వి. చందన తెలిపారు.



## అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్, 75 లక్షల
# విలువ గల చోరీ సొత్తు స్వాధీనం




- 24 గంటలలోనే కేసును చేదించిన బాపట్ల జిల్లా ఇంకొల్లు పోలీసులు

**బాపట్ల ఏప్రిల్ 5 హంస వాయిస్**

**జిల్లా స్టాఫ్ రిపోర్టర్**

బాపట్ల జిల్లా ఇంకొల్లు పోలీస్ స్టేషన్ పరిధిలో ఏప్రిల్ 3వ తేది అర్ధరాత్రి సమయంలో జరిగిన రూ. 55,50,000/ నగదు రూ.20,00,000/ విలువ గల 24 సవర్లు బంగారు ఆభరణాల చోరీ జరిగింది. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ కేసును సవాలుగా తీసుకొని జారీచేసిన ఆదేశాలతో 24 గంటలలోనే ఇంకొల్లు పోలీసులు కేసును ఛేదించారు. అంతర్ రాష్ట్ర ముద్దాయిని అరెస్ట్ చేసి చోరీ సొత్తును స్వాధీన పరుచుకున్నారు. జిల్లా ఎస్పీ స్థానిక పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కేసు వివరాలను వెల్లడించారు.

కేసు వివరాలను పరిశీలిస్తే జాగర్లమూడి శివ ప్రసాద్ ఇంకొల్లు ఆర్.టి.సి బస్టాండ్ ఎదురుగా ఉన్న మూడు అంతస్తుల భవనంలో నివాసం ఉంటున్నారు. శనగలు అమ్మగా వచ్చిన నగదు, అతడు నడిపే స్కూల్ విద్యార్థులు చెల్లించిన పీజులు మొత్తం రూ.55,50,000/ నగదు, కుటుంభ సభ్యులు యొక్క 24 సవర్ల బంగారు ఆభరణంలు పెంట్ హౌస్ లోని బీరువాలో భద్రపరిచాడు. ఏప్రిల్ 3వ తేది రాత్రి రెండవ అంతస్తులో నిద్రించారు. ఉదయం లేచి చూడగా పెంట్ హౌస్ తలుపుల తాళం పగుల గొట్టి బీరువా బద్దలు చేయబడి ఉంది. అందులో ఉన్న నగదు, బంగారు ఆభరణాలు దొంగిలించ బడినట్లు గ్రహించి 2025 ఏప్రిల్ 04 న ఉదయం 08.30 గం.లకు ఇంకొల్లు పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశాడు. బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ దూడి భారీ దొంగతనం కేసును సవాలుగా తీసుకొని చీరాల డిఎస్పీ మోయిన్ ఆధ్వర్యంలో ఇంకొల్లు సిఐ రమణయ్య, ఎస్ఐ సురేష్, ఇంకొల్లు పోలీస్ స్టేషన్ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినారు. సాంకేతిక పరిజ్ఞాన్ని వినియోగించుకొని, సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు నిర్వహించారు. గస్తీ ముమ్మరం చేసినారు. ఏప్రిల్ 5న వేకువజామున ఇంకొల్లు కానిస్టేబుల్ హరిచ్చంద్ర నాయక్ హోంగార్డ్ పనిత్ కుమార్ లు గస్తీ విధులు నిర్వహిస్తు ముద్దాయి మహమ్మద్ షరీఫ్ (34 సం) గురించిన సమాచారం తెలుసుకొని సిఐ రమణయ్యకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న సిఐ, ఎస్ఐ సురేష్ లు స్టేషన్ సిబ్బంది, మధ్యవర్తులను వెంటబెట్టుకొని వెళ్ళి ముద్దాయిని అరెస్ట్ చేసి అతడు దొంగిలించిన సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిది తెలంగాణ రాష్ట్రంలోని సిద్దిపేట జిల్లా గజ్వల్ మండలం అమీద్ పురం గ్రామం. 14 కేసులలో నిందితుడిగా ఉన్నాడు. వాటిలో కొన్ని కేసులలో జైలు శిక్ష అనుభవించాడు. మరికొన్ని కేసులు విచారణలో ఉన్నాయి. ముద్దాయికి ఇంకొల్లు గ్రామానికి చెందిన సాయికి చెంచల్ గూడా సెంట్రల్ జైలులో పరిచయం ఏర్పడింది. సాయి గంజాయి కేసులో నిందితుడిగా ఉన్నాడు. ప్రస్తుతం స్థానికంగా హోటల్ నడుపుతున్నాడు. అందులో వంట చెయ్యడానికి మార్చి 30న ముద్దాయిని పిలిపించాడు. జాగర్లమూడి శివ ప్రసాద్ ఇంటిని ముద్దాయి రక్కి చేసుకొని ఏప్రిల్ 3నఅర్ధరాత్రి సుమారు 12 గంటలకు ఫిర్యాది ఇంటికి వెనుక వైపుగా ఉన్న మెట్ల ద్వారా గోడ పై నుండి దూకి పెంట్ హౌస్ గదికి వేసిన తాళం, బీరువా డోర్ లను ఇనుప చెలగపార, సీలింగ్ ఫాన్ ఇనుప కడ్డీతో పగలకొట్టి, ఇనుప చువ్వ సహాయముతో బీరువా డోర్ ఓపెన్ చేసినాడు. అందులో ఉన్న డబ్బుల కట్టలు, ఒక స్టీలు గిన్నెలో ఉన్న బంగారు ఆభరణాలును దొంగిలించాడు. ముద్దాయి దొంగిలించిన రూ. 55,50,000/ నగదు, రూ.20,00,000/ విలువ గల 24 సవర్ల బంగారు ఆభరణాలు మొత్తం రూ. 75,50,000/ విలువగల చోరీ సొత్తు స్వాధీనం చేసుకోవడం జరిగింది. నేరం జరిగిన 24 గంటలలోనే ముద్దాయిని అరెస్టు చేసి చోరీ సొత్తు రికవరీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన చీరాల డిఎస్పీ మహమ్మద్ మోయిన్, ఇంకొల్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ వై.వి.రమణయ్య, ఇంకొల్లు సబ్ ఇన్స్పెక్టర్ జి.సురేష్, ఇంకొల్లు పోలీస్ స్టేషన్ సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసా పత్రాలు అందజేసి, నగదు రివార్డ్ అందజేసినారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఇంటికి తాళాలు వేసి విహార యాత్రలు, తీర్థయాత్రలకు వెళ్లేవారు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం ఇవ్వడం వల్ల ఆ ఇంటిపై నిఘా ఉంచి ఆ ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు. ప్రజలు వీలైనంత వరకు వారి ఇంటి చుట్టూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వేసవి కారణంగా రాత్రి సమయాలలో వేడిని తట్టుకోలేక చాలామంది ప్రజలు ఆరుబయట, మిద్దె పైన నిద్రించడం జరుగుతోందన్నారు. ఇదే అవకాశంగా తీసుకొని నేరస్తులు ఇండ్లలోకి చొరబడి చోరీలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి రాత్రి సమయాలలో ఇంటి తలుపులకు తాళాలు వేసుకొని అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

# ఘనంగా బాబు జగ్జీవన్ రామ్ జయంతి..



**అనకాపల్లి, ఏప్రిల్ 5 (హంస వాయిస్ ప్రతి నిధి) :**

భారత మాజీ ఉప ప్రధాని, గొప్ప సమాజ సేవకుడు డా.బాబు జగ్జీవన్ రామ్ జయంతిని అనకాపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఇ.శ్రీనివాసులు, ఇతర పోలీస్ అధికారులు కలిసి డా. బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పుష్పమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ "డా. బాబు జగ్జీవన్ రామ్ గారు నేటి తరానికి ఆదర్శప్రాయుడు అని,, అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం అందించేందుకు, సమానత్వం స్థాపించేందుకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయం అన్నారు. భారతదేశ రాజ్యాంగంలో సామాజిక న్యాయాన్ని సుస్పష్టం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు అని కొనియాడారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, రాజకీయ నాయకుడిగా, పరిపాలన దక్షుడిగా దేశానికి ఆయన ఎంతో సేవలందించారు అని అన్నారు. ఆయన ఆశయాలను అనుసరిస్తూ, సమాజంలో సమానత్వాన్ని నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని అన్నారు. కార్యక్రమంలో ఎస్.బి ఇన్స్పెక్టర్ శ్రీమతి టి.లక్ష్మి , జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ నీ అవమానించిన శ్రీ చైతన్య, నారాయణ, ఎస్ఆర్, మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి




**కర్నూలు ప్రతినిధి, ఏప్రిల్ 5(హంస వాయిస్):**

డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ నీ అవమానించిన శ్రీ చైతన్య, నారాయణ, ఎస్ఆర్, మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి అని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర అధ్యక్ష కార్యదర్శులు అబూబకర్, సాయి ఉదయ్ లు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు నగరంలో ఉన్న శ్రీ చైతన్య, నారాయణ, ఎస్ఆర్ మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థలు భారతదేశ మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర సమరయోధులు డాక్టర్ బాబు జగజీవన్ రావు జయంతి సందర్భంగా సెలవు ఇవ్వకుండా అవమాననించడం జరిగిందన్నారు. స్వాతంత్ర సమరయోధుల గురించి విద్యార్థులకి చెప్పాల్సిన విద్యాసంస్థలు విద్యార్థులకు మంచి సమాచారాన్ని ఇవ్వకుండా తమ ఖజానాన్ని నింపుకోవడం కోసం తరగతుల నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం సెలవు ఇచ్చినా కూడా కార్పొరేట్ విద్యాసంస్థలు ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. అంతేకాకుండా విద్యాసంస్థల యాజమాన్యాలు డాక్టర్ బాబు జగ్జీవన్ రావు ఎవరో ఆయన గురించి మాకు తెలియదు అని ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులతో అన్నారన్నారు. ఎంతటి దుర్మార్గమైన పరిస్థితుల్లో కార్పొరేట్ విద్యా వ్యవస్థ ఉందో దీన్ని బట్టి మనకు అర్థమవుతుందన్నారు. కేవలం మార్కులు తెచ్చుకుని డబ్బులు సంపాదించాలని ఆలోచనలో కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థులను తీవ్రమైన ఒత్తిడికి గురి చదువులు చెబుతున్నారు. ఇంతటి దుర్మార్గమైన ప్రవర్తన కలిగి ఉన్న కార్పొరేట్ విద్యాసంస్థలపై కర్నూలు జిల్లా ఆర్ఐవో వెంటనే చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. విద్యార్థులకు సమాజం గురించి నేర్పే పాఠాలు చెప్పాలని కార్పొరేట్ విద్యాసంస్థలకు హెచ్చరించాలని కోరుకుంటున్నాము అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా బాలికల కమిటీ సభ్యురాలు లక్ష్మీ, ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర ఉపాధ్యక్షులు ఆర్యన్, మల్లేష్ నగర సహాయ కార్యదర్శి పృథ్వి,ఆదిత్య కర్నూలు నగర కమిటీ సభ్యులు యోగి, ప్రవీణ్,చరణ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక అంతరాలను అదిగమించి రాజకీయంగా ఎదిగిన స్ఫూర్తిదాత బాబు జగజ్జీవన్ రామ్



- జగజ్జీవన్ రామ్ స్ఫూర్తితో సామాజిక సమరాన్ని కొనసాగిద్దాం
- కెవిపియస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యం డి ఆనంద్ బాబు

**కర్నూలు ప్రతినిధి, ఏప్రిల్ 5(హంస వాయిస్):**

**పరాయి పాలనతో పాటు సామాజిక అసమానతలు కొనసాగుతున్న భారత సమాజంలో పుట్టిన బాబు జగ్జీవన్ రామ్, ఇంతింతై వటుడింతై అన్న చందంగా అంటరాని సమాజానికే రాజకీయ దిక్సూచిగా మారాడని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి ఆనంద్ బాబు తెలియజేశారు. శనివారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో కర్నూల్ నగరంలోని ఆర్ఎస్ కూడలి లో ఉన్న బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి 117 వ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతిభ లేక ఆధారపడే సమాజం అంటూ ఎగతాళి చేసిన వారికి ఎదురెళ్లి మెరిట్ ప్రాతిపదికన చదువును పూర్తిచేసిన ఘనుడన్నారు. 78 సంవత్సరాలు జీవించిన జగజ్జీవన్ రామ్ పుట్టిన 28 సంవత్సరాలకే రాజకీయ అరంగేట్రం చేసి లెజిస్లేటివ్ కౌన్సిల్ మెంబర్ గా నియమించబడ్డాడన్నారు. 50 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో దేశంలోనే అత్యంత కీలకమైన కార్మిక శాఖ బాధ్యతలు నిర్వహించారన్నారు. సామాజిక తరగతుల సమస్యల పరిష్కారానికై సంఘం పెట్టి తానున్న పార్టీని సైతం ఎదిరించిన ధీరుడన్నారు. భారతదేశ ఉప ప్రధానిగా అఖిలభారత కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిగా సేవలందిం చారన్నారు. అలాంటి జగజ్జివన్ రామ్ గారి జయంతి నిర్వహణలో అధికారులు, పాలకుల సైతం వివక్ష చూపినట్లుగా కనపడుతోందన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాల్సిన కార్యక్రమం 10 గంటలకు ప్రారంభం కావడం లోనే స్ఫూర్తిని తగ్గించారన్నారు. తూతూ మంత్రంగా జయంతులను జరపడం కంటే మేం జరపలేమని ఎత్తివేస్తే సామాజిక సంఘాలే ఆ బాధ్యతను భుజాన వేసుకుంటాయన్నారు. జగజ్జీవన్ రామ్ స్ఫూర్తితో సామాజిక సమస్యల పరిష్కారానికై మరింత ఐక్యంగా సమరం కొనసాగించాలని కోరారు. జయంతి కార్యక్రమంలో కెవిపిఎస్ కర్నూలు న్యూ సిటీ అధ్యక్ష కార్యదర్శులు యేసు రాజు, భాస్కర్, ఓల్డ్ సిటీ అధ్యక్షులు ఆర్ రమణ, ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్ష కార్యదర్శులు అబూబకర్, సాయి ఉదయ్, కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎన్ చక్రపాణి, నగర కార్యదర్శి వర్గ సభ్యులు చిన్న రోషన్న, లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.**

## ఈ నెల 7వ తేదీన నన్నూరులో రెండు
# తెలుగు రాష్ట్రాల కబడ్డీ పోటీలు

**ఓర్వకల్ ఏప్రిల్ 5 (హంస వాయిస్):**

**మండల పరిధిలోని నన్నూరు గ్రామంలో శ్రీరామ నవమి పండుగ సందర్భంగా ఈనెల 7వ తేదీన రెండు తెలుగు రాష్ట్రాల కబడి పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ ఎం వెంకటేశ్వర్లు తెలిపారు. దాతల సహకారంతో ఈ కబడి ఆటల గెలుపొందిన వారికి మొదటి బహుమతి 30,016/-వేలు, రెండవ బహుమతి 20,016/- మూడవ బహుమతి 15,016/- నాలుగవ బహుమతి 10,016/- ఐదవ బహుమతి 5,016/- ఈ కబడి పోటీలను ప్రారంభించుటకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, పాణ్యం టిడిపి యువ నాయకులు గౌరు జనార్దన్ రెడ్డి, నన్నూరు టిడిపి నాయకులు విశ్వేశ్వర్ రెడ్డి ప్రారంభం చేస్తారు . ఈ కబడి పోటీలకు ఆసక్తి కలవారు 500/- ఎంట్రీ ఫీజు చెల్లించి పి టి శ్రీనివాసులు నెంబర్ కు 9885797327 తమ యొక్క పేర్లను నమోదు చేయాలని తెలిపారు.**



# సామాజిక సంఘసంస్కర్త బాబు జగ్జీవన్ రామ్

**బాపట్ల, ఏప్రిల్ 5 హంస వాయిస్**
**జిల్లా స్టాఫ్ రిపోర్టర్**

గొప్ప సామాజిక సంఘసంస్కర్త, స్వాతంత్ర సమరయోధుడైన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ పేర్కొన్నారు.బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి కార్యక్రమం సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికల వసతి గృహంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ, బుడా చైర్మన్ శలగాల రాజశేఖర్ బాబు, ఆర్డీవో పి గ్లోరియా, తదితరులు పుష్పమాలలతో ఘనంగా నివాళులర్పించారు. జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థినీలకు జిల్లా సంయుక్త కలెక్టర్, శాసనసభ్యులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.



బాబు జగ్జీవన్ రామ్ ను ప్రేరణగా తీసుకుని విద్యార్థినీలు ముందుకు సాగాలని జిల్లా సంయుక్త కలెక్టర్ చెప్పారు. ఎస్సీల నుంచి తొలి రాజకీయ నాయకుడు, భారత ఉప ప్రధానిగా ఎదిగిన గొప్ప వ్యక్తిగా ఆయన అభివర్ణించారు. మంత్రి పదవులను సమర్థంగా నిర్వహించారని, మంత్రిగా ఆయన పనిచేసిన కాలంలో హరిత విప్లవం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. పేదరికం నుండి వచ్చిన జగ్జీవన్ రామ్ ఎంతో ఉన్నత స్థాయికి ఎదిగారని, భారత దేశ సంక్షేమ కోసం ఎన్నో సంస్కరణలు చేశారన్నారు. బీహార్ రాష్ట్రంలో ఆయన పుట్టిన ఊరు సందర్శించి, ఆయన చరిత్ర తెలుసుకునే అవకాశం లభించిందని విద్యార్థినీలకు ఆయన వివరించారు. ఆర్థికంగా అత్యంత వెనుకబడిన సామాజిక వర్గాలకు మేలు చేయాలనే ఉద్దేశంతో ప్రతినెల మూడో శుక్రవారం ఎస్టీలు, దివ్యాంగుల కోసం ప్రత్యేక పిజిఆర్ఎస్ నిర్వహిస్తున్నామని చెప్పారు. స్పెషల్ డ్రైవ్ ద్వారా జిల్లాలో మూడు వేల మందికి ఆధార్ కార్డులు, జనన ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందించామన్నారు. బాబు జగ్జీవన్ రామ్, అంబేద్కర్ సాధించిన విజయాలను భావితరాలకు వివరించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వారి జయంతి కార్యక్రమాలను ప్రభుత్వ వసతి గృహాలలోనే నిర్వహించాలని ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలను ప్రభుత్వం దేవాలయాలుగా భావిస్తున్నందున ఇక్కడే నిర్వహిస్తామన్నారు. భారతమాత ముద్దుబిడ్డ జగ్జీవన్ రామ్ ను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. 40 సంవత్సరాలు పార్లమెంటు సభ్యుడిగా, 34 ఏళ్ల పాటు కేంద్ర క్యాబినెట్ మంత్రిగా పనిచేసి చరిత్రలో నిలిచిన గొప్ప నాయకుడన్నారు. ఏ శాఖను కేటాయించినప్పటికీ తన ప్రతిభా పాటవాళ్లను చాటుకుని, ఉన్నత విలువలతో మంచి పాలన అందించారన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం వీరోచితంగా పోరాడిన యోధుడని ఆయన చెప్పారు. ఆయనలోని పోరాట పటిమ, ప్రతిభ పాటవాలను గుర్తించిన ఆనాటి ప్రభుత్వాలు క్యాబినెట్లో వివిధ పదవులను కేటాయించిందరన్నారు. ఆయన గొప్పతనాన్ని చాటి చెప్పడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి జాతీయ పండుగలా జరపడం సంతోషదాయకమన్నారు. యుద్ధము, హరిత విప్లవంలో విజయకేతనాన్ని ఎగరవేశారని తెలిపారు. అలాంటి వారిని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని వివరించారు విద్యతోనే పేదరికాన్ని జయించవచ్చని చాటి చెప్పిన మహనీయులు బాబు జగ్జీవన్ రామ్ అని బుడా చైర్మన్ శలగాల రాజశేఖర్ బాబు తెలిపారు. విద్య, ఆర్థిక రంగాలలో అడుగులు ముందుకు వేసినప్పుడే నిజమైన స్వాతంత్రం సాధించినట్లు అవుతుందన్నారు. రాజకీయ రంగంలో తనదైన ముద్ర వేసుకుని చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. మీ జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకునే అవకాశం విద్యతోనే సాధ్యమన్నారు. అంటరానితనం నిర్మూలనకు ఆయన బీజాలు వేశారన్నార. సమన్యాయం అన్ని సామాజిక వర్గాలకు వర్తించాలనే దిశగా జగ్జీవన్ రామ్ చేపట్టిన కార్యక్రమాలను ఆయన వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో పి గ్లోరియా, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ సాధికారత అధికారి రాజా దెబోరా, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఎస్ విజయమ్మ, ఎస్సీ, ఎస్టీ నాయకులు చారువాక, ఎన్ ధర్మానాయక్, జి నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

# పీ4కు అనూహ్య స్పందన..
# రూ.10 కోట్ల వితరణకు ప్రసాద్ సీడ్స్ సంసిద్ధత



ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుతో పీ-4కు అనూహ్య స్పందన లభిస్తోంది. సొంత నిధులతో కొమ్మమూరు లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మాణానికి ప్రసాద్ సీడ్స్ అధినేత సంసిద్ధత వ్యక్తం చేశారు. లిఫ్ట్ స్కీమ్ నిర్మాణానికి రూ.10 కోట్ల వితరణ చేస్తామని ప్రసాద్ సీడ్స్ చైర్మన్ ప్రసాద్ స్పష్టం చేశారు. కొమ్మమూరు లిఫట్‌తో గుంటూరు జిల్లా కాకుమాను మండలంలో 5,315 ఎకరాలకు తాగునీటి స్థిరీకరణ కానుంది. రైతుల కోసం లిఫ్ట్ నిర్మాణానికి ముందుకు వచ్చిన ప్రసాద్ ఔదార్యాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. సమన్వయం చేసుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారులను సీఎం ఆదేశించారు.




# దేశం గర్వించదగ్గ మహనీయుడు జగజ్జీవన్ రామ్

**బాపట్ల ఏప్రిల్ 5 హంస వాయిస్**
**జిల్లా స్టాఫ్ రిపోర్టర్**



దేశం గర్వించదగ్గ మహనీయుడు డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ అని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ కొనియాడారు. జగజ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా జిల్లా ఎస్పీ స్థానిక పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించినారు. వారు దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. బాబూ జగజ్జీవన్ రామ్ సామాజిక సమానత్వం కోసం పోరాడిన మహనీయుడన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడని, సంఘసంస్కర్తగా, భారత ఉప ప్రధానిగా బాబూ జగ్జీవన్ రామ్ జీవితం నేటి యువతకు స్ఫూర్తి దాయకమన్నారు. అంటరాని వారికి సమానత్వం కల్పించడం కోసం అంకితమైన ఆల్ ఇండియా డిప్రెస్డ్ క్లాసెస్ లీగ్ యొక్క స్థాపనలో కీలకపాత్ర పోషించారన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ యొక్క తాత్కాలిక ప్రభుత్వంలో అతి పిన్న వయస్కుడైన మంత్రి అయ్యాడన్నారు. ఉప ప్రధానిగా పనిచేశారని సమాజ హితం కోసం చేసిన సేవలు మహోన్నతమైనవని దేశం గర్వించదగ్గ మహనీయుడు జగ్జీవన్ రామ్ అని తెలిపారు. ఈ కార్యక్రంలో ఏఆర్ డిఎస్పీ విజయసారధి, బాపట్ల డిఎస్పీ రామాంజనేయులు, ఎస్.బి ఇన్స్పెక్టర్ నారాయణ, అడ్మిన్ ఆర్.ఐ మౌలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## కచ్చితత్వంతో కూడిన సమాచారం
# వేగవంతంగా సేకరించాలి

**బాపట్ల ఏప్రిల్ 5 హంస వాయిస్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్**



పోలీస్ శాఖలో నిఘా విభాగం విధులు కీలకమని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ తెలిపారు. శనివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా నిఘా విభాగ పోలీస్ అధికారులు, సిబ్బందితో ఎస్పీ సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీస్ శాఖ సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు, అసాంఘిక కార్యకలాపాలు కట్టడి చేయడానికి ముందస్తు సమాచారం వేగవంతంగా సేకరించడం కీలకమని ఎస్పీ తెలిపారు. ముందస్తు సమాచారం సేకరించడం వలన ఆదిలోనే నేరాలను అరికట్టి శాంతి భద్రతలను పరిరక్షించవచ్చునన్నారు. నిత్యం ప్రజలతో మమేకమై గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తులు, చెడునడత కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. అట్టివారు ఏదైనా నేరానికి పాల్పడే అవకాశం ఉందని గ్రహిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా పేకాట, కోడిపందాలు వంటి ఇతర అసాంఘిక కార్యకలాపాలు గురించిన ముందస్తు సమాచారం ఉన్నతాధికారులకు అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ నిబద్ధతతో అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు. కచ్చితత్వంతో కూడిన సమాచారం వేగవంతంగా సేకరించి అందించాలన్నారు. ఎవరైనా విధులలో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించిన, నిగూఢ రహస్య సమాచారం సేకరించడంలో అలసత్వం వహించిన శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏస్.బి ఇన్స్పెక్టర్ నారాయణ జిల్లా ఏస్.బి సిబ్బంది పాల్గొన్నారు.

**ఏపీ టూరిజం పాలసీ 2024-25లో భాగంగా రాష్ట్రానికి వచ్చే పర్యాటక ప్రాజెక్టుల ప్రతిపాదనలను సమీక్షించేందుకు కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏడుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ.**










Editor, Printed And Published Owned By Ediga Nagaraju, H.No: 84/188A, Near YSR Statue, Shareen Nagar, Kalluru Mandal, Kurnool Dist. Printed At Maa Janani Publications, H.No: 84/1192, Shareen Nagar, Kalluru Mandal, Kurnool Dist, Pin: 518 002, RNI No: AP Tel/2019/77777, email address: hamsavoice@gmail.com. Contact No: +91 9949246060